

GRAM PANCHAYAT
HELP DESK MISSION


# వార్త

10 ఆగస్టు, 2025

ఆదివారం


# 'స్థానిక' పాలనే గ్రామ స్వరాజ్యం



ఒక రోడ్డు ఉదాహరణగా తీసుకుంటే మన ఊళ్లో రోడ్డు వేయాలంటే గ్రామ పంచాయతీ వేయాలి. మన ఊరి నుండి మరో పక్క ఊరికి రోడ్డు వేయాలంటే మండల పరిషత్ చూడాలి.

అలాగే ఒక మండలం నుండి మరో మండల కేంద్రానికి రోడ్డు వేయాలంటే జిల్లా పరిషత్ ఒక జిల్లా నుండి మరో జిల్లాకు రోడ్డు రాష్ట్ర ప్రభుత్వం; ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి రోడ్డు వేయాలంటే జాతీయ రహదారుల సంస్థ.. ఇలా అంచెలంచెలుగా పనుల విభజన జరుగుతుంది.



ఇది ఒక్కరోజు విషయమే కాదు, అన్ని పనులూ ఇలా కింది నుండి పైకి– పని పరిధిని బట్టి వికేంద్రీకరించబడాలి. కానీ వాస్తవంలో మన దేశంలో గ్రామంలో వేసే రోడ్డుపని 'ప్రధాన మంత్రి సడక్ యోజన' అనే పథకం కింద, ప్రాథమిక పాఠకుల మౌలిక వసతుల కోసం సర్వశిక్షా అభియాన్, మన ఊళ్లో ఆశా వర్కర్ నియామకం, జాతీయ ఆరోగ్య మిషన్ కింద జరుగుతుంది. ఇది పచ్చిగా చెప్పాలంటే గల్లీలో సమస్యకు ఢిల్లీలో పరిష్కారాలు వెతకడం లాంటిది.

మన ఊళ్లో మన పాలన ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే పౌరుడు కేంద్రంగా పాలన సాగాలి. దాన్నే 'థియరీ ఆఫ్ సబ్సిడియారిటీ సూత్రం' అంటారు. ప్రజల భాగస్వామ్యం కోసం ఇది సరైన పద్ధతి.

థియరీ ఆఫ్ సబ్సిడీయారిటీ అంటే ఈ థియరీలో 'సబ్సిడీ' అనే మాట ఉంది కనుక చాలామంది ప్రజలకు ఉచితంగా ఇచ్చే సబ్సిడీ అనుకుంటారు. థియరీ ఆఫ్ సబ్సిడీయారిటీ అంటే అది కాదు. "వ్యక్తి కేంద్రంగా పాలన" సాగాలని ఈ సిద్ధాంతం చెబుతుంది. వ్యక్తి నుంచి కుటుంబం కుటుంబం నుంచి గ్రామం లేక పట్టణం అక్కడ నుండి మండలం, జిల్లా, రాష్ట్రం, జాతీయ ప్రభుత్వం వరకు వ్యక్తి 'సెంట్రిక్' గా (కేంద్రంగా) ప్రభుత్వాలు పని చేసే వ్యవస్థనే మనం "థియరీ ఆఫ్ సబ్సిడియారిటీ" అంటాం.

అలాగే అధికార వికేంద్రీకరణ అంటే మనం పుస్తకాలలో చదువుకున్నట్లు పైన కేంద్రం నుండి కింద గ్రామం వరకు పై నుంచి కిందికి అధికార వికేంద్రీకరణ చేస్తామని చెబుతారు. కానీ అసలైన నిజమైన అధికార వికేంద్రీకరణ అంటే గ్రామం 'బేస్'గా లేక పట్టణం కేంద్రంగా మొదలై మండలం, జిల్లా, రాష్ట్రం ఇలా కేంద్రం వరకు కింది నుంచి పైకి అధికార వికేంద్రీకరణ జరిగినప్పుడే నిజమైన అధికార వికేంద్రీకరణగా చెప్పుకోవచ్చు.

ఇలా ఇంటి ముందు ప్రభుత్వం–కంటి ముందు పాలన జరగాలంటే అధికార వికేంద్రీకరణ సూత్రం పాటించాలి. దీని వ్యతిరేకులు ఒక వాదం మన ముందుకు తెస్తారు. అదేమిటంటే కింది స్థాయిలో పని చేసే ప్రజా ప్రతినిధులు, అవినీతిపరులు, వారి పాలనా సామర్థ్యం తక్కువ. వారికి పాలించే అర్హతలు లేవు. చదువు, ఇతరత్రా తెలివితేటలు వుండవు. దాంతో అధికార వికేంద్రీకరణ కాస్తా అవినీతి వికేంద్రీకరణగా మారుతుందని అంటారు.

ఇది ఆడవాళ్లకు ఆడవాళ్లే శతృవు అని ఆడవాళ్లను వ్యతిరేకించేవారు సృష్టించిన సామెత లాగానే స్థానికంగా అధికారాలు వికేంద్రీకరణ వద్దనే వారి వాదన. అందుకే ఏ అంచెలో ఆ అంచె అవినీతి జరగకుండా చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ ఏర్పాటు చేయాలి. అంటే స్థానిక ప్రభుత్వం అవినీతిపై 'అంబుడ్స్‌మెన్' నియమించాలి. ఈ వ్యవస్థ ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో వుంది. అంబుడ్స్‌మెన్ ఒక స్వతంత్ర సంస్థగా వుండి స్థానిక ప్రభుత్వాలలో బాధ్యతా రహితంగా ప్రవర్తించిన ప్రజా ప్రతినిధులను విచారించి చర్య తీసుకునే అధికారంతో వుండాలి. తప్పుకి శిక్ష, మంచిని ప్రోత్సహించే విధంగా వుండాలి.



తన హృదయంలోకి వీక్షించి అక్కడ కన్పించినదాన్ని యథాతథంగా రాసే రచయితకు ఎక్కువ మంది పాఠకులు ఉంటారు.

– హెన్రిక్ ఇబ్సన్

# సమాజం దేనినో కోల్పోతోంది..

సింగిల్ పేజీ కథ

**సమయం** ఉదయం పది గంటలు కావొస్తోంది. భర్త ఆఫీసుకు వెళ్లిపోవడంతో జయంతి వంట గదిలో సామాన్లు సర్దుకొని, వచ్చి హాలులో సోఫాలో విశ్రాంతిగా కూర్చుంది. ముఖానికి పట్టిన చెమటను చీరకొంగుతో తుడుచుకుంటూ.. టివి రిమోట్ చేతిలోకి తీసుకొని ఆన్ చేసింది.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగడం వినిపించింది. "ఈ సమయంలో ఎవరొచ్చారబ్బా!" అనుకుంటూనే లేచివెళ్లి తలుపు తీసింది.

ఎదురుగా తన స్నేహితురాలు రమ కూతురు లలిత నవ్వుతూ కనిపించింది. జయంతి ఆనందంతో ఆప్యాయంగా లలిత చేయి పట్టుకొని లోపలకు తీసుకు వస్తూ తలుపు మూసింది.

లలితను సోఫాలో కూర్చుండమని చెప్పి ఫ్రిజ్ వద్దకు వెళ్లి డోరు తెరిచి చల్లటి నీళ్లను గ్లాసులో నింపి, తెచ్చి లలితకు అందించింది.



లలిత గ్లాసు అందుకొని కొద్దిగా తాగి, టీపాయ్‌పై ఉంచింది.

"ఏమమ్మా! లలిత అంతా బాగున్నారా? నీవు గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నావని మీ అమ్మ చెప్పింది! నిజమేనా? మరి ఎలా చదువుతున్నావ్? సాధించాలంటే చాలా కష్టపడాలి మరి! ఆల్‌ది బెస్ట్!" అంటూ లలితను అభినందిస్తూ, జయంతి లేచి కిచెన్ వైపుకు వెళ్లింది. ఒక ప్లేటులో స్వీటు, కొన్ని బిస్కెట్లు ఉంచి, తీసుకు వచ్చి లలిత ముందు టీపాయ్‌పై ఉంచుతూ, "తీసుకోమ్మా!" అంటూ లలిత పక్కనే కూర్చుంది. "ఇప్పుడు ఇవన్నీ ఎందుకు ఆంటీ!" అంటూనే తీసుకొని తినడం మొదలు పెట్టింది లలిత.

రమతో కలిసి గడిపిన తమ కాలేజీ రోజుల్ని గుర్తు చేసుకుంటూ, సంబరపడిపోతూ జయంతి, తమ అనుభవాలను చెప్పుకుంటూ పోతుంటే, లలిత ఆమెనే చూస్తూ ఆసక్తిగా వింటోంది. తినడం పూర్తి చేసి, కొద్దిగా నీళ్లు తాగి, గ్లాసు టీపాయ్‌పై ఉంచుతూ,

జయంతి ఇచ్చిన నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ "ఆంటీ! ఎల్లుండి మమ్మీ ఇంట్లో ఏదో వ్రతం చేయాలని అనుకుందిట. ఆ వ్రతానికి మిమ్మల్ని తప్పకుండా రమ్మన్నానని మరి మరీ చెప్పమని నన్ను పంపించింది. నిజానికి, మమ్మీనే స్వయంగా మిమ్మల్ని పిలవడానికి రావాలని అనుకుందిట కాని.. పనుల ఒత్తిడి వల్ల కుదరలేదని చెప్పమంది. 'అందుకు ఏమీ అనుకోవద్దని చెప్పమంది. అందుకే నేను వచ్చాను" అంది లలిత.

జయంతి చిన్నగా చిరునవ్వు నవ్వుతూ.. "వ్రతానికి కాకపోయినా, మీ మమ్మీని చూసేందుకైనా తప్పకుండా వస్తాను" అని చెప్పు. "చాలా రోజులైంది. రమను చూసి" అంటూ లలిత పక్కనే సోఫాలో కూర్చుంది.

లలిత తన ఫోన్ తీసింది క్యాబ్ బుక్ చేసేందుకు. జయంతి వస్తూ "ఎవరికమ్మా ఫోన్ అంటూ?" లలిత పక్కనే సోఫాలో కూర్చుంది.

"లేదంటీ! క్యాబ్ కోసం ఫోన్ చేస్తున్నాను" అంది లలిత.

ఆ మాట విన్న జయంతి, "వద్దమ్మా! ఫోన్ చేయొద్దులే. మా కారులో నిన్ను దిగవిడుస్తానులే! నాకూ చిక్కడపల్లి పోవాల్సి ఉంది... మా బంధువుల ఇంటికి. మా కారులో పోదాం ఉండు. అయిదు నిమిషాల్లో రడీ అవుతాను" అంటూ తన బెడ్ రూమ్‌లోకి వెళ్లి ముస్తాబై హేండ్ బ్యాగ్‌తో బయటకు వచ్చింది.

"లలితా! పదమ్మా! వెళదాం!" అంటూ లలితతో పాటు బయటకు వచ్చి, ఇంటికి తాళం వేసి, కీ తన హేండ్ బ్యాగ్‌లో వేసుకొని, కారు వద్దకు నడిచింది.

కారు డోరు తెరిచి, సీట్‌లో కూర్చుని కారును స్టార్ట్ చేసి ఎసిని ఆన్ చేసింది. సీట్ బెల్ట్ పెట్టుకుంటూ, "లలితా!" అంటూ పిలిచి డోర్ తెరిచింది.

లలిత కారులో కూర్చొని సీట్ బెల్ట్ పెట్టుకుంది. జయంతి కారును ముందుకు పోనిస్తూ..

రమతో తన పరిచయం, కాలేజీలో ఆనందంగా గడిపిన రోజులు గుర్తు చేసుకుంటూ, ముచ్చటిస్తుంటే లలిత వింటూ ఆనందిస్తోంది. ఇంతలో లలిత ఫోన్ మోగింది. అటు ఫోన్‌లో లలిత తండ్రి సుధాకర్ మాట్లాడుతున్నాడు. చిన్నగా మాటలు జయంతి చెవిలో పడుతున్నాయి. "అమ్మా లలితా! ఇంటికి బయలుదేరావా? క్యాబ్ బుక్ చెయ్యమంటావా?" అని అడుగుతుంటే..

"లేదు డాడీ! ఆంటీనే తన కారులో నన్ను ఇంటికి దిగవిడుస్తానన్నారు. చిక్కడపల్లిలో వాళ్ల బంధువుల ఇంటికి వెళ్లాల్సిన పని ఉందిట తనకు. అందుకే తన కారులోనే వస్తున్నాను! కాసేపట్లో ఇంటికి చేరుకుంటాం!" చెప్పింది లలిత. "అలాగా! సరే! ఆంటీకి భోజనం ఏర్పాట్లు చూడండి. ఆంటీని అడిగానని కూడా చెప్పు" అంటున్నాడు సుధాకర్. వింటున్న జయంతి చిన్నగా నవ్వుకుంది.

ఫోన్ ఆఫ్ చేస్తూ "ఆంటీ! డాడీ ఫోన్ చేశారు.తప్పకుండా మిమ్మల్ని భోజనం చేసి మరీ వెళ్లమంటున్నారు. నవ్వుతూ అంది లలిత. జయంతి నవ్వింది. కొద్ది నిమిషాల్లో కారు రమ ఇల్లు చేరుకుంది. కారు పక్కకు తీసి, ఇంజిన్ ఆఫ్ చేసి, డోరు తెరిచి జయంతి కిందకు దిగుతుంటే "అప్పుడే కారు దిగిన లలిత జయంతి దగ్గరకు వచ్చి "థ్యాంక్స్ ఆంటీ.. బై" అంటూ చేతులు ఊపుతూ తమ ఇంటి వైపు పోసాగింది.

ఊహించని ఆ ఘటనకు జయంతి నిర్ఘాంతపోయింది. ఆమె మెదడు పనిచేయడం మరిచిపోయింది. తేరుకున్న ఆమె పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసింది. 'సమాజం దేనినో కోల్పోతోంది'. అని స్వగతంలో అనుకుంటూ ప్రశాంతంగా కారు డోరు మూసి, సీట్ బెల్ట్ పెట్టుకొని, స్టార్ట్ చేసి నెమ్మదిగా చిక్కడపల్లి వైపు కారును పోనిచ్చింది!

**- బి.ఎన్.సత్యనారాయణ**

## ఓటమి లోంచి..



పార్కులో ఆ పిల్ల
ఉయ్యాల ఊగుతోంది
ముందు కాళ్లతో ఆకాశాన్ని
అందిపుచ్చుకోవాలని
వెనక నుంచి వీపుతో
దూరాన్ని తోసెయ్యాలని
ఈసారి బలంగా, వేగంగా
ఉయ్యాల ఊగిసలాడుతోంది
పిల్ల బొక్కబోర్లా పడ్డది
మోచేతి మీద ఎర్రగా
సూర్యుడు జేవురించాడు
ఒప్పుకోని వెగటు నవ్వొకటి
పిల్ల పెదాలపై దొర్లింది
ఇప్పుడు ఆ పిల్ల చదువు
వాటి పైనే.

– దాసరాజు రామారావు

## అంతకు మునుపే!

తను నిలబడరాని
చోట నిలబడింది
పాదచారుల చూపులు
శూలాలై తనువును
తూట్లు పొడుస్తున్నాయి
పనిగట్టుకొని నేనెళ్ళి
పక్కన నిలబడ్డాను
చూపులన్నీ
పక్కదారి పట్టాయి..
ఇది గమనించిన పెద్దామె
ఆడపిల్లల తండ్రివా.. అంది
అంతేకాదు.. అంతకు మునుపే
ఓ అమ్మకు బిడ్డను అన్నాను.
పెద్దమ్మ చూపుల్లో ఆశీస్సులు
తన చూపుల్లో కృతజ్ఞతలు.

– సురేంద్ర రొడ్డ

## కొత్త బంగారు లోకం

కన్నీటి కొలనులో
పూసిన చిరు
దీపం
వెన్నెల కాంతిలో
ప్రభవించిన ఉషా కెరటం
నెత్తుటి చిత్తడి నేలలో మొలకెత్తిన
అంకురపు ఆశాకిరణం
ఈ జీవితంలో..
అన్నీ అపరాధ భావనలే
తెలిసి, తెలియని అగాథాలే..
నిరాశ కుంపటిలో మునిగిపోతున్న
బతుకు నావకు



నీ చల్లని
చూపులు- నీ
ప్రేమ
ఆత్మీయతలు
నాపై కురిపించిన క్షణమే..
మళ్లీ అమ్మ కడుపులో పుట్టినట్టుంది!
నీ చెయ్యి పట్టుకొని నడవాలని
వుంది..
నీ గుండెల్లో శాశ్వతమైన
చోటు కోసం తపస్సు
చెయ్యాలని వుంది..!
నీ స్నేహం కోసం పరితపించే
పరిమళం కావాలని వుంది..
నీ ఒడిలో చిన్న పిల్లాడిలా
గువ్వలా ఒదిగిపోయి
నా ఊపిరి ఉన్నంతవరకు
నీ శ్వాసనై నీ ఎద తోటలో
విహరించాలని..
నీవు పాడే పాటకు తాళంనై
కొత్త బంగారు లోకానికి దారి
చూపాలని నా ఆశ.. నా ధ్యాస..
ఇదే మనిషిగా నా కర్తవ్యం.

– కొండా రవీందర్

## మై సిగ్నేచర్

నీ పరిచయపు ప్రపంచం
నా జీవన పుడమిన
ఓ ఉదయపు వరమే అనుకున్నా..!

అది నా అంతరంగపు
శూన్యాన
పెను తుఫానుల కలవరమై
మిగులున్నా..!!

నా చుట్టూ నలు దిక్కులు
గాఢాంధకారపు నిశీధి
అలుముకున్నా
నీ జ్ఞాపకాల కోటితారల
వెలుగులోనే బతుకుతున్నా..!

అడుగు.. అడుగు దూరమై
అణువు అణువు ఏకమై
ఏ దారి వైపో నా పయనం
నీ స్పర్శకై నిరీక్షిస్తుంది
నా నయనం..!
నీటిపై రాతలాగ చెదిరిపోదుగా
నీ పరిమళపు ప్రవాహం
నీలి గగనాన మెరుపులాగా
మిగిలిపోదుగా నీ గుండెపై
నా సంతకం..!

ఎక్కడో.. నువ్వున్నా
నా ఎద నిండా దాగున్నా
నీ తలపులలో ఎడబాటే
నా కనురెప్పల్లో తడబాటే
పల్లవి లేని పాటనై
మూగబోయిన గొంతుతో
విలపిస్తున్నా...!

ప్రణయమేదో ప్రళయమేదో
తెలియని రహస్యాల కోటలో
బందీ అయ్యింది
మన జీవిత గమన కవిత్వం..!

నీతో నడిచే ఓ అందమైన
ప్రయాణం కోసమే
నా గుండె శబ్దాల అన్వేషణ..!
నీ పేరుతో నా పేరు పెనవేసుకునే
మూడు ముళ్ల క్షణం కోసమే నా
ఆరాధన..!!

నువ్వు ఎప్పటికీ నా ఊహల
డోలనాల స్వప్నం కాదు..!
నువ్వు ఏనాటికైనా
నా ఊపిరి కోవెల
ఫిజిక్స్ ప్రతిబింబమే..!!

– ఫిజిక్స్ అరుణ్ కుమార్

# చినుకుల్లో...వేడి వేడి చిరుతిండి!

విందు-పసందు

## పనీర్-కార్న్ వడ



**కావలసిన పదార్థాలు** స్వీట్‌కార్న్ గింజలు: కప్పు, పనీర్ తురుము: అరకప్పు, ఉల్లిపాయ: ఒకటి, సెనగపిండి: రెండు చెంచాలు, బియ్యప్పిండి: చెంచా, పచ్చిమిర్చి: నాలుగు, అల్లం: చిన్నముక్క, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడ.

**తయారు చేసే విధానం:** అల్లం, పచ్చిమిర్చి, స్వీట్ కార్న్ గింజలని మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఒక గిన్నె లోకి ఈ స్వీట్‌కార్న్ మిశ్రమం, పనీర్ తురుము, సెనగపిండి, బియ్యప్పిండి, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసుకుని బాగా కలిపి పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. కడాయిలో నూనె పోసుకుని వేడెక్కాక.. పనీర్, స్వీట్ కార్న్ మిశ్రమాన్ని వడల్లా అద్దుకుని నూనెలో వేయించాలి. బంగారు రంగులోకి రాగానే తీసేసుకుంటే వేడి వేడి వడలు రెడీ.

## క్రిస్పీ కార్న్..



**కావలసిన పదార్థాలు** మొక్కజొన్న గింజలు: రెండు కప్పులు, కార్న్‌ఫ్లోర్: నాలుగు చెంచాలు, జీలకర్రపొడి: పావు చెంచా, చాట్‌మసాలా: చెంచా, కారం: అరచెంచా, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు: రెండు చెంచాలు, కొత్తిమీర తరుగు: రెండు చెంచాలు, నిమ్మరసం: చెంచా, నూనె: వేయించడానికి సరిపడినంత; ఉప్పు: రుచికి తగినంత.

**తయారు చేసే విధానం:** మొక్కజొన్న గింజల్ని ఉప్పువేసిన నీళ్లలో మూడు నిమిషాలు ఉడికించి నీళ్లను వార్చేసి పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో ఉడికించిన మొక్కజొన్న గింజలూ, తగినంత ఉప్పు, మిరియాల పొడి వేసుకోవాలి. అలాగే కార్న్‌ఫ్లోర్, బియ్యప్పిండిలో సగం తీసుకుని గింజలకి బాగా పట్టేట్టు కలుపుకోవాలి. కడాయిలో నూనె పోసి వేడెక్కాక ఈ గింజలని దోరగా వేయించుకుని గిన్నెలోకి తీసుకోవాలి. ఈ గింజలపైనే మిగిలిన కార్న్‌ఫ్లోర్, బియ్యప్పిండి కూడా వేసి మరోసారి కలుపుకోవాలి. అవసరమైతే ఒక కాసిన్ని నీళ్లు చల్లొచ్చు. ఇప్పుడీ గింజలని రెండోసారి నూనెలో వేయించుకుంటే మొక్కజొన్న గింజలు క్రిస్పీగా వస్తాయి. వీటి పైన జీలకర్రపొడి, కారం, కొత్తిమీర, చాట్ మసాలా వేసి కలిపి చివరిగా ఉల్లిపాయ ముక్కలు, నిమ్మరసం చల్లుకుంటే సరి.

## మొక్కజొన్న సర్వపిండి



**కావలసిన పదార్థాలు** మొక్కజొన్న గింజలు: కప్పు, వెల్లుల్లి రెబ్బలు: నాలుగు, పచ్చిమిర్చి: ఐదు, మొక్కజొన్న రవ్వ: కప్పు, బియ్యప్పిండి: కప్పు, నానబెట్టిన సెనగపప్పు: పావుకప్పు, కారం: చెంచా, కరివేపాకు: రెండు రెబ్బలు, ఉల్లిపాయముక్కలు: మూడు చెంచాలు, జీలకర్ర: చెంచా, అల్లంపేస్ట్: చెంచా, కొత్తిమీర తరుగు: చెంచా, పసుపు: అరచెంచా, వేయించి పొట్టు తీసి పెట్టుకున్న పల్లీలు: మూడు చెంచాలు, ఉప్పు: తగినంత, నూనె: అరకప్పు.

**తయారు చేసే విధానం:** పచ్చిమిర్చి, వెల్లుల్లిరెబ్బలు, మొక్కజొన్న గింజలని మిక్సీ లో మెత్తగా రుబ్బుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో మొక్కచొన్న రవ్వ, బియ్యప్పిండి, కారం, నానబెట్టిన సెనగపప్పు, ఉప్పు, కొత్తిమీర తరుగు, కరివేపాకు తరుగు, ఉల్లిపాయ ముక్కలు, జీలకర్ర, అల్లంపేస్ట్, పసుపు, పల్లీలు, రుబ్బి పెట్టుకున్న మొక్కజొన్న పేస్ట్‌ని కూడా వేసి చపాతీపిండిలా కలుపుకోవాలి. ఒక కడాయి తీసుకుని దాంట్లో నూనె వేసి, సిద్ధం చేసి పెట్టుకున్న సర్వపిండిముద్దను కడాయిలో అన్ని వైపులా పరుచుకునేలా చేత్తో ఒత్తుకోవాలి. తగినంత నూనె వేస్తే ముద్ద చక్కగా పరుచుకుంటుంది. దీనికి చేత్తో అక్కడక్కడా చిల్లులు పెట్టి... ఆ తర్వాతే కడాయిని స్టవ్ పైన పెట్టాలి. ఐదారు నిమిషాలకి కమ్మని మొక్కజొన్న సర్వపిండి రెడీ అవుతుంది.

# వికాసానికి గ్రంథాలయాలు అవసరం

గొప్ప సాహిత్య సంపద, సంస్కృతిక వారసత్వాలతో పాటు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో గ్రంథాలయాలకు చెదలు పడుతున్నాయి. ఇది విచారకర పరిణామం. దేశవ్యాప్తంగా యాభై వేలకు పైగా గ్రంథాలయాలు వున్నాయి. వాటిలో అతి తక్కువ మాత్రమే ఆధునికత సంతరించుకొన్నాయి.

ప్రభుత్వ గ్రంథాలయాల్లో సగటు పుస్తకాల సంఖ్య సుమారు ఆరు వేలు కాగా, అభివృద్ధి చెందిన దేశాల్లో లక్షా ఎనిమిది వేల పుస్తకాలు వున్నాయి. పన్నెండు శాతం లైబ్రరీల్లో కంప్యూటర్లు ఉన్నాయని, వాటిలో కొన్నింటికి మాత్రమే ఇంటర్నెట్ సౌకర్యం వుందని 2018 యూనెస్కో ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ రిపోర్ట్ పేర్కొంది. ఈ వ్యవస్థలో 12 లక్షల మంది పని చేస్తున్నారు. కానీ వీరిలో వృత్తి పరమైన అర్హతలు వున్నవారు కేవలం పది శాతం మందే. ఇది మన గ్రంథాలయ వ్యవస్థ పరిస్థితి.

పిల్లల్లో చదివే ఆసక్తి పెంచడానికి కేంద్ర సంస్కృతిక మంత్రిత్వ శాఖ నేషనల్ బుక్ ట్రస్ట్ సాయంతో "ఈ పుస్తకాలయం" ఇటీవల ప్రారంభించింది. దీనిలో వెయ్యి పాఠ్య పుస్తకేతర "ఈ" పుస్తకాలను 22 భాషల్లో ప్రారంభించింది. ఇది అమిత ప్రశంసనీయమైన కార్యక్రమం. కానీ ఇదొక చాలా చిన్న కార్యక్రమం. మనకు ఇంకా చాలా భాషలున్నాయి. పైగా పాఠశాలలన్నిటికీ ఇంటర్ నెట్ వసతి లేదు. మనది ప్రపంచంలోనే అత్యధిక యువత వున్న దేశం. వీరి శక్తి యుక్తులు పూర్తి స్థాయిలో దేశానికి అందాలంటే వారికి మంచి శిక్షణ అవసరం. అందుకు గ్రంథాలయాలు అత్యంత ముఖ్యం. పిల్లలు, యువత, పెద్దల విజ్ఞాన అవసరాలు వేరు వేరుగా ఉంటాయి. అంతర్జాతీయ పోటీ ప్రపంచ అవసరాలకు ధీటుగా జ్ఞాన సముపార్జన అవకాశాలను అన్ని తరాల వారికి సుగమం కావించాలి.



దేశంలో భారీ స్థాయిలో తాళపత్ర నిధులు వున్నాయి. వివిధ భాషల్లో, వివిధ అంశాల్లో ఉన్న అమూల్య జ్ఞాన నిధి సేకరించారు. ఇవి మన పురాతన సంస్కృతీ సౌరభాలు. జాతీయ మెన్సస్క్రిప్ట్ సేకరణా బృందాలు దేశం నలు చెరగుల నుండి సేకరించిన వాటిలో 75 లక్షల తాళ పత్రాలను డాక్యూమెంట్ చేశారు. ముప్పై లక్షల పత్రాలను కంప్యూటరీకరించి నేషనల్ మెన్సస్క్రిప్ట్ పోర్టర్‌లో పొందుపరచారు. వీటిని పరిశోధకులకు, ఔత్సాహికులకు అందుబాటులో ఉంచాలి. అలాగే ప్రఖ్యాత అంతర్జాతీయ రచయితల రచనలు, వాటి అనువాదాలు కూడా పాఠకులకు అందివ్వాలి.

విషయం చాలా ముఖ్యం. వివిధ అంశాలు జాగ్రత్తగా ఎంపిక చేయాలి. ఈ బుక్స్, ఆడియోలు, గ్రాఫిక్ నవలలు, మల్టీ మీడియాలకు నేడు ప్రాధాన్యత బాగా పెరిగింది. అదే స్థాయిలో స్థానిక సమాజ సంగతులు ప్రతిబింబించే స్థానిక కథా రచయితల కథలు, మాండలికాలను ఆదరించాలి. అంతేకాకుండా సాంకేతిక ఖాళీని పూరించడానికి ఉచిత వైఫై వసతి కల్పించాలి. కంప్యూటర్ ల్యాబ్‌లో పాఠకులకు శిక్షణ ఇవ్వాలి. అప్పుడే సామాన్యులందరు సాంకేతికత ఉపయోగించగలరు.

లైబ్రరీలల్లో రచయితల, వక్తల ఉపన్యాసాలు, కవితా గోష్టులు నిర్వహించడం వలన పద సౌందర్యం తెలుస్తుంది. సాహిత్య ఆసక్తి అంకురిస్తుంది. దేశ భాషలు భాసిల్లుతాయి. బయటకు చదవడం వలన వచ్చే ఆనందానుభూతి రుచి తెలుస్తుంది. రసజ్ఞత మెల్లగా అందరిలో ఇనుమడిస్తుంది.

2019 జాతీయ శాంపిల్ సర్వే గ్రామీణ మహిళల అక్షరాస్యత 35 శాతం దగ్గరే కొట్టుమిట్టాడుతోందని వెల్లడించింది. వారి అక్షరాస్యత పెంచడానికి గట్టి ప్రయత్నం అవసరం.

ఇటీవల గ్రామీణ ప్రజా గ్రంథాలయాలు ఏర్పాటుకు, వీటి ద్వారా స్త్రీ విద్యా వ్యాప్తికి సృజనాత్మకంగా పని చేసిన ఇద్దరి గురించి రవంతైనా తెలుసుకోవాలి. డార్జలింగ్‌కు చెందిన కళాకారిణి, సామాజిక సేవకి ఆక్వి తామి వనితల్లో విద్య, చైతన్యాల వ్యాప్తికి విలక్షణమైన మహిళా గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. ఈమె 'సిస్టర్ లైబ్రరీ'ని 2018లో ముంబయిలో మొదలు పెట్టారు. ఇది గ్రామీణ స్త్రీల కోసం పనిచేసే సంచార గ్రంథాలయం. ఇది పుస్తకాలను నేరుగా పల్లెల్లోని మహిళల చేతికే చేరవేస్తుంది. తొలుత ఆమె దగ్గర వుండే పుస్తకాలు ఇచ్చి వారిని చదివించారు. ప్రజల నుండి చందాలు పెరిగిన తరువాత మహారాష్ట్రలోని చాలా గ్రామాలకు గ్రంథాలయ సేవలు విస్తరింపచేశారు. మహిళల కోసమే రాసిన పుస్తకాలు అందించడం వలన వారిలో వారు చర్చించుకోవడం మొదలయింది. తరువాత మహిళా మండళ్లు పెట్టారు. మరో అడుగు ముందుకేసి మహిళల కోసం వానా కాలం పాఠశాలలు ప్రారంభించారు.

షేక్ షాదిక్ ఆలీ సీనియర్ పాత్రికేయుడు, వ్యాపారి. 2015 ఫిబ్రవరిలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు నుండి తోపుడు బండిలో పుస్తకాలు నింపుకొని ఇంటింటికి పుస్తకం చేర్చాలనే ఆశయంతో బయలుదేరారు. బండి తోసుకొంటూ జంట నగరాల్లో 350 కిలోమీటర్లు నడచి అందరికి పుస్తకాలు తక్కువ ధరకు అమ్మారు. పుస్తకంపై ప్రేమ పెంచడానికే నా ఈ ప్రయాణం అని చెప్పారు. తరువాత గ్రామీణ బాట పట్టింది తోపుడు బండి. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, వరంగల్ జిల్లాల్లోని మారుమూల పల్లెల్లో 150 గ్రామీణ ప్రజా గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రంథాలయాలకు పుస్తకాలు, కుర్చీలు, బల్లలు సమకూర్చారు. గ్రామాల్లో పుస్తక ఆవిష్కరణలు చేశారు. సాహిత్య సభలు పెట్టారు.



పుస్తకాలపై ప్రేమ వుండి కొనుక్కోలేని నిరుపేద గిరిజన, గ్రామీణ పిల్లలకు ఇరవై నాలుగు లక్షల రూపాయలు విలువ చేసే పుస్తకాలు ఉచితంగా పంచారు. దీనిలో కుటుంబం, మిత్రులు, మీడియా పాలుపంచుకోవడం ముదావహం. వీరి అకాల మరణం గ్రామీణ గ్రంథాలయ స్థాపనకు తీరని లోటు. గత కొన్ని సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ లైబ్రరీలు నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఇక్కడే కాదు దేశమంతటా ఇదే పరిస్థితి వుంది. ప్రభుత్వాలు పరిస్థితి చక్కబరచాలి. ప్రజల భాగస్వామ్యంతో నేటి అవసరాలకు తగ్గట్టు గ్రంథాలయాలు తీర్చిదిద్దాలి. మనో వికాసంలోనే ప్రగతి దాగి వుంది. ప్రతి తరం వికాసానికి గ్రంథాలయాలు అవసరం.

**- వి.వరదరాజు**



# ప్రతిరోజూ జాతీయ గీతాలాపన

ప్రతి దేశానికి ఓ జాతీయ గీతం ఉంది. దేశ జాతీయ గీతాన్ని ప్రతి వారు గౌరవిస్తారు. ప్రతి దేశం వారికి మాతృదేశం పట్ల గౌరవ భావం ఉంటుంది. మన దేశానికి ఓ ప్రత్యేక గీతం ఉండటం, ఆ గీతాన్ని ప్రతి భారత పౌరుడు గౌరవించడం చూస్తున్నదే. ఆనాడు స్వాతంత్ర సమరంలో మొక్కవోని దీక్షతో, అవిశ్రాంతంగా పోరాటం చేసి నిస్వార్థంగా సేవ చేసిన దేశ భక్తులు ఎందరో. అలాంటి వారిలో బాలగంగాధర్ తిలక్ ఒకరు. "స్వాతంత్రమే ఊపిరిగా బ్రిటిష్ వారిని మూడు చెరువుల నీళ్లు తాగించిన అవిశ్రాంత జనకుడుగా బిరుదు పొందిన తిలక్ దేశ భక్తి ఎన్నదగినది. ఎల్లప్పుడు దేశం కోసం పరితపించిన నాయకుడు. అతివాద నాయకుడిగా పేరు పొందిన నాయకత్రయంలో లాల్, బాల్, పాల్‌లలో బాల్‌గా ప్రసిద్ధి చెందాడు. ఇలా ఒక్క తిలకే కాదు. ఎందరో నాయక మన్యులు ఉన్నారు. తొలి స్వాతంత్ర పోరాటంలో ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఆశయాలు ముందుకు తీసుకు వెళ్తూ, తాడిపత్రి పట్టణంలో ఆయన విగ్రహం పెట్టడం అభినందనీయం. విగ్రహాలు పెడుతున్నామేగానీ వారి త్యాగాలను స్మరించుకోవటంలో విఫలమవుతున్నాం. దేశ ప్రజలలో ఒక రకమైన నిద్రాణమైన అలసత్వం నెలకొంది. వారిని మేల్కొలపాలి అంటే ఒక శక్తి కావాలి. దేశ స్వాతంత్రంలో ఒక అల్లూరి, ఒక గాంధీ, సుభాష్ చంద్రబోస్, అజాద్, భగత్ సింగ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో స్వాతంత్ర సమర యోధులు గుర్తుకు వస్తారు. వారందరినీ మనం వారి జయంతులు, వర్థంతులప్పుడు కొందరు స్మరించుకుంటున్నారు, కొందరు విస్మరిస్తున్నారు. ఇది చాలా శోచనీయం. ప్రజలను పీడించి దేశ సంపదను హరించి వేసిన బ్రిటిష్ వాళ్లతో పోరాడి అసువులు బాసిన దేశభక్తులు ఎందరో. బ్రిటీష్‌వాళ్ల ఏలుబడిలో మనం హీనాతి హీనంగా బతికాం. మన భారతీయులను చూసి, వారు పడుతున్న బాధలను చూసి 'క్విట్ ఇండియా' అని పిలుపునిచ్చిన మహాత్మ గాంధీజీని మనం మననం చేసుకోవడం మన కర్తవ్యం. అందుకే దేశ ప్రజలను ఉత్తేజితులు చేసేందుకు ఎన్నో మార్పులతో త్రివర్ణ పతాకం ఏర్పడింది. దేశానికి ఒక జాతీయ గీతం కావాలి అని నాయకులు తీర్మానించారు. ఆ బాధ్యతను విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌కు అప్పగించారు. ఠాగూర్ ఒక మహత్తరమైన, ఉత్తమోత్తమమైన గీతాన్ని దేశ ప్రజలకు దేశంలోని పలు ప్రాంతాలను, జీవ నదులను తల పోస్తూ, అందరి కంటే మిన్నగా దేశ నాయకులను తలచుకుంటూ దేశ ఔన్నత్యం కీర్తిస్తూ 'జనగణ మన' అంటూ ఒక గీతం లిఖించారు. ఈ గీతం వివిధ ప్రభుత్వ కార్యక్రమాలలో, విద్యా సంస్థలలో ఆగష్టు 15, జనవరి 26న మాత్రమే మనం పాడుకుంటున్నాం. కొన్ని విద్యా సంస్థలలో ప్రేయరే ఉండదు. ఇక జాతీయగీతం ఎక్కడ పాడుతారు? దేశ నాయకులను ఎక్కడ స్మరిస్తారు?

ప్రజలలో జాతీయ భావాలు ఉండాలని, జాతీయ గీతంలో ప్రతి ఒక్కరూ పాలు పొందాలని రోటరీ క్లబ్ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ప్రతిరోజు తాడిపత్రి పట్టణంలో స్వచ్ఛంద సంస్థ అయిన రోటరీ క్లబ్ ఉదయం 8.30 నిమిషాలకు కేవలం ఒక్క నిమిషం వివిధ కూడళ్ళలో అంటే తాడిపత్రి పట్టణం బస్ స్టాండ్ సమీపంలో, పోలీస్ స్టేషన్ సమీపంలో, అశోక్ పిల్లర్ సమీపంలో ఒకేసారి జాతీయ గీతం ఆలపిస్తారు. ఆ క్షణంలో ఎక్కడివారు అక్కడ నిలబడి సెల్యూట్ చేస్తూ జాతీయ గీతం పాడతారు. ఈ విధంగా ప్రతిరోజు జరుగుతుంది. మనం ఒక్క అడుగు వేస్తే ఎన్నో అడుగులు పడతాయి. అందుకు నిదర్శనమే దేశ జాతీయ గీతాలాపన.

**- కనుమ ఎల్లారెడ్డి**

కథ

# నల్లకోడి తెల్లకోడి

ఒక ఊరిలో ఒక నల్లకోడి,తెల్లకోడి వుండేవి. అవి పక్క పక్కనే గుడ్లను పొదిగాయి. ఒకసారి అనుకోకుండా నల్లకోడి పొదిగిన గుడ్డు తెల్లకోడి దగ్గరికి దొర్లుకుంటూ వెళ్ళింది. ఒక గుడ్డు కలిసొచ్చిందనే పేరాశతో రెక్కల కిందికి తోపుకుంది తెల్లకోడి. కొద్ది రోజులకు రెండు కోళ్ళు ఒకేసారి పిల్లల్ని లేపాయి. తెల్ల కోడి లేపిన పిల్లల్లో ఒకటి మాత్రమే నల్లగా వుంది. మిగతావన్ని తెల్లగా పుట్టాయి. గుడ్డు కలిసొచ్చిందని మొదట సంబరపడింది.



కోడి పిల్ల నల్లగా పుట్టేసరికి అయిష్టత పెంచుకుంది. తెల్ల కోడి "ఇది నా బిడ్డ కాదు నా పిల్లలు తెల్లగా వున్నాయి" అని ఆ పిల్లను దగ్గరకు రానిచ్చేది కాదు. ముక్కుతో పొడిచి పొడిచి తరిమేసేది. ఈ పిల్ల నీదే.. నాది కాదు.. నా పిల్లలు తెల్లగా వున్నాయి, ఇది కోడి పిల్లలా లేదు కాకి పిల్లలా వుంది అంటూ ఎగతాళి చేస్తూ నల్ల కోడిని అవమాన పరిచింది. నల్ల కోడి చాలా బాధపడింది. కొన్ని రోజుల తరువాత తెల్లకోడి పిల్లలు అనారోగ్యంతో ఒక్కొక్కటీ చనిపోతూ వచ్చాయి. చివరికి తెల్లకోడి ఒంటరిదై పోయింది. అనాథలా మిగిలిపోయింది.

నల్లకోడి దగ్గరికి వెళ్ళి "తను పొడిచి తరిమేసిన ఆ కోడి పిల్లను తనకు తిరిగి ఇవ్వమని" అడిగింది. చిన్నప్పటి నుంచి నల్లకోడి వద్దే పెరిగిన పిల్ల కాబట్టి తెల్లకోడి దగ్గరికి వెళ్లడానికి ఇష్టపడలేదు.. పైగా అది పొడుస్తుందని భయపడింది.

"ఇప్పటికైనా బుద్ధి వచ్చిందా? ఏదైనా పోగొట్టుకున్నప్పుడే దాని విలువ తెలిసేది. గర్వంతో వద్దనుకున్నావు అన్నీ కోల్పోయాక నల్ల కోడిపిల్ల విలువ తెలిసొచ్చింది. నలుపు, తెలుపు అనే తేడా కాదు ముఖ్యం. మంచి గుణం వుంటే చాలు. అందం అన్నం పెట్టదు గుర్తించుకో.. ముందు నీ గుణం మార్చుకో!" అంటూ తెల్లకోడికి బుద్ధి చెప్పింది నల్లకోడి.

పశ్చాత్తాపంతో వెనుదిరిగింది తెల్లకోడి.

- ఎన్. రాజారెడ్డి





వార్త ఆదివారం



## బాలగేయం

### ధ్యాస..

చదువు సన్నిధి సుఖమన్నా
బడియే బాలల దోస్తన్నా
గురువుల భోదే మేలన్నా
జ్ఞానాలకు పెన్నిధి అన్నా
బాల గేయాలు
శతక పద్యాలు
కంఠమెత్తి పాడాలి
లోకమే మురియాలి
అమ్మా నాన్న కోరికలూ
పెద్దవారి మాటలు
చదవుపై సూచనలు
చదివే శ్వాస ధ్యాసలు

..................

### ప్రశ్నలు..

వింతగా కనిపించే వాటిని
అడిగి తెలుసుకో చూస్తారు
ఆశ్చర్యాలు కలిగినంతనే
ఆహా ఓహో అంటారు.
పెద్ద వాళ్ళు చెప్పిన వాటిని
పరిపరి విధాల చూస్తూనే
విషయాలెన్నో తెలవగానే
ఇక మీరే గురువులవుతారు.
ప్రశ్నే విజ్ఞానానికి రహదారి
వాటి జవాబులు ఉపకారి
ఇంటా బయట ఎక్కడైనా
ప్రశ్నిస్తూనే ఎదగాలి
చదువులు బాగా చదవాలి
జ్ఞానాలెన్నో పొందాలి.

**-పెందోట వెంకటేశ్వర్లు,** సిద్దిపేట

## హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

బి.సంధ్య, చౌటుప్పల్

**ప్రశ్న: వర్షంలో తడిస్తే జలుబు వస్తుందా?**

**జవాబు:** వర్షంలో తడిసినంత మాత్రాన జలుబు చేస్తుందనడం శాస్త్రీయంగా తప్పు. అసలు జలుబంటూ చేయని మనిషెవరూ ఉండరు. శరీరంలో ఉష్ణోగ్రత తగ్గినా, పెరిగినా జలుబు చేసే అవకాశం ఉంది. జలుబు వాస్తవానికి మన ఇంటి వాతావరణమే కల్పిస్తుంది. జలుబుకారక వైరస్‌లు చెమ్మగా ఉండే ఉష్ణోగ్రతలోనే అధిక శాతం వృద్ధి చెందుతాయి. వర్షం బాగా పడుతున్నప్పుడు మనం ఇంట్లోనే వెచ్చగా ఉండిపోతాము నుకోండి. అప్పుడు ఉక్కపోస్తూ, ఆవిరి వస్తూ ఉంటుంది. దీనినే చెమ్మతో కూడిన ఉష్ణోగ్రత అని అంటారు.

ఎ. నర్మద, వలిగొండ

**ప్రశ్న: ప్రతి మతానికి ఒక చిహ్నం ఉంటుంది, కారణమేమిటి?**

**జవాబు:** ఏ చిహ్నమైనా ఆయా ఉత్పత్తులు, మతాలు, సిద్ధాంతాలను ప్రజలలో ప్రచారం చేయడానికే. ఆయా మతాలను వెంటనే గుర్తించడానికి ప్రతీకలుగా చిహ్నాలు ఉపయోగపడతాయి. ఇక మతం విషయానికి వస్తే మతం మత్తుమందుకు చిహ్నాలు ప్రతీకలు. ఆయా మతాల భావనలను మళ్లీ మళ్లీ గుర్తింపు తెచ్చుకోవడానికి, నిరూపించడానికీ ఈ చిహ్నాలను వాడుకోక తప్పదు. ఆయా చిహ్నాలు మతాల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబాలు. కంటికి కనిపించని ఆయా మతాల దేవుళ్లకు ప్రతినిధులు ఈ చిహ్నాలే! మతానికి చిహ్నమే లేకపోతే మతమనేది చరిత్ర అగాధపుటంచులలోకి వెళ్లిపోతుంది. మతాలు, తమ చిహ్నాలనేవి మనుషులంతా ఒకటేనని బోధించకపోగా, వేర్వేరు అని గుర్తు చేస్తుంటాయి.





# పొదుపు.. జీవితం మలిచే మార్గం



మనిషి జీవితంలో కోర్కెలు అనంతం. ఆ కోరికలను తీర్చుకోవడం అనేది సహజమే. కానీ ఒక నిర్మాణాత్మకమైనటువంటి కార్యాచరణ ద్వారా ముందుకు సాగితే మెరుగైన జీవితానికి అవకాశాలు ఎన్నో ఉంటాయి.

పొదుపు అంటే కేవలం డబ్బును దాచుకోవడం అనే ఏదో ఒక ప్రత్యేకమైనటువంటి నిర్వచనానికి పరిమితం కాదు. అది జీవనశైలి, స్వీయ క్రమశిక్షణకు, భవిష్యత్తు పట్ల బాధ్యతాయుత దృక్పథానికి నిదర్శనం. మన సంపాదన కన్నా, దానిలో ఎంత భాగాన్ని మిగిలించగలమన్నదే నిజమైన జీవిత భద్రత. ఈ భద్రత మన ఆత్మవిశ్వాసానికి పునాది.

చిన్నతనంలోనే పొదుపు అలవాటు ఏర్పడితే, మనిషి జీవితాంతం ఆర్థికంగా స్థిరంగా ఉండడానికి అవకాశాలు కోకొల్లలు. అవసరాన్ని తెలుసుకోవడం, ఆశను అర్థవంతంగా మలచుకోవడం– ఇవన్నీ పొదుపు ధోరణిలో భాగాలు. అవసరాలపై ప్రశ్న వేయగల సామర్థ్యం కూడా ఈ అలవాటుతోనే కలుగుతుంది.

అనవసర ఖర్చులను నియంత్రించడం, వినియోగానికి ముందు ఆలోచించడం, మితిగా వ్యయం చేయడం– ఇవన్నీ తెలివైన జీవనశైలికి మార్గాలు.

## ఆత్మనిర్భరతకు పునాది

పొదుపు వల్ల మనలో స్వయం ఆధార భావన పెరుగుతుంది. ఆ భావన అనేకమైనటువంటి మంచి పనులపై అంటే నిర్మాణాత్మకమైనటువంటి భవిష్యత్తుకు అనేక మార్గాలు కలవు.

చిన్న చిన్న మార్పులతో పెద్ద ప్రయోజనాలు సాధ్యమవుతాయి. ఉదాహరణకు వృధా ఖర్చులు తగ్గించడం, ప్రతి చిన్న పనిని వాహనానికి బదులుగా నడక వంటి అలవాట్లు ఆరోగ్యానికీ, ఖర్చులకూ మేలు చేస్తాయి.

పిల్లలకి చిన్న వయస్సులోనే పొదుపు విలువను నేర్పితే, వారు భవిష్యత్‌లో ధైర్యంగా నడవగలుగుతారు. స్టూడెంట్ అకౌంట్లు, చిన్న జేబు ఖర్చులు – ఇవి సరైన దిశలో మలచితే గొప్ప ఫలితాలు ఇస్తాయి.

కుటుంబానికి నాయకత్వం వహించేవారే ముందుగా పొదుపులో చొరవ చూపితే, పిల్లలు సైతం ఆ తత్వాన్ని అనుకరిస్తారు. పొదుపు ఒక్కరికి కాదు, తరతరాల ఆర్థిక స్థిరతకు పునాది. వృద్ధాప్యంలో మద్దతు కావాలంటే, యువ స్థితిలో మిగులు ఉండాలి. కొంత మిగులుపెట్టినవారు కష్టసమయంలో ఒడిగట్టే ధైర్యం కలిగి ఉంటారు. అనుకోని పరిస్థితుల్లో ఎదుగుదలకూ, ఆపదల నుంచీ బయట పడటానికి కూడా పొదుపే అండ. “పెద్దల మాట చద్దన్నం మూట..” అనే సూక్తులతో మరిన్ని పొదుపు గురించి పలు ఉదాహరణలతో కూడా గతంలో పెద్దలు చెప్పిన విషయాలను కూడా మనం గుర్తు చేసుకోవచ్చు.

## సమాజ నిర్మాణానికి శక్తి

ఒక్కొక్క వ్యక్తితో మొదలైనటువంటి పొదుపు భాగాలలో అది ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. పొదుపు వ్యక్తిగత ప్రయోజనం మాత్రమే కాదు. అది సమాజ నిర్మాణానికి మూలస్తంభం. మీరు పొదుపు చేసిన డబ్బు బ్యాంకులో ఉంటే, అది మరొకరికి రుణంగా మారుతుంది. వ్యాపారం, విద్య, ఆరోగ్య సేవలు వంటి వాటికి నిధిగా నిలుస్తుంది.

పొదుపుతో పెట్టుబడికి మార్గం ఏర్పడుతుంది. పెట్టుబడి ద్వారా ఆదాయం, ఆదాయంతో తిరిగి మరింత పొదుపు.. ఇది ఒక ఆర్థిక చక్రంలా సాగుతుంది. డిజిటల్ పద్ధతుల్లో ఇప్పుడు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయి: బడ్జెట్ యాప్‌లు, సేవింగ్స్ ప్లాన్లు, మైక్రో ఇన్వెస్ట్‌మెంట్లు.

పర్సనల్ ఫైనాన్స్ అనే భావన మన దేశంలోనూ బలపడాలి. ఇది పాఠశాల స్థాయిలోనే నేర్పే పాఠంగా మారాలి. ప్రతి వ్యక్తి నెల ఆదాయంలో 10శాతం అయినా పొదుపుగా ఉంచగలిగితే, వారి జీవితంలో నిస్సంకోచంగా ముందుకెళ్లే ధైర్యం ఏర్పడుతుంది. పొదుపు మానసిక శాంతికి మార్గం. అది నిర్ణయ శక్తిని పెంచుతుంది. మన జీవితం మీద నియంత్రణ కలిగిస్తుంది. అదే నియంత్రణ, అదే స్పష్టత మన లక్ష్యాలను చేరుకోవడంలో గమ్యమైన మార్గం చూపుతుంది. పొదుపు అనేది ఒక్కరోజు పని కాదు. అది ప్రతిరోజూ పాటించాల్సిన జీవన ధర్మం. మీరు ఎంత సంపాదించినా, ఎంత ఖర్చు చేసినా కొంత పొదుపు చేయాలన్న తపన ఉంటే చాలు. అదే అసలైన ధనం. అదే భవిష్యత్‌కు బలమైన ఆసరా.

**- డా. చిటికెన కిరణ్ కుమార్**

# రన్‌వే మధ్యలో రైల్వే లైన్?

రైళ్లు వెళ్తున్నప్పుడు రైల్వే లైన్ దాటి వెళ్లాల్సిన వాహనాలను కొద్దిసేపు నిలిపివేస్తారు. అది సర్వసాధారణం. అలాంటిది విమానం వెళ్తోందని రైలునే ఆపేస్తే?

ఆశ్చర్యంగా ఉంది కదా! మీరు చదువుతున్నది నిజమే. ప్రపంచంలో అలాంటి విమానాశ్రయం ఒకే ఒక్కటి ఉంది. అదే న్యూజిలాండ్‌లోని గిస్‌బోర్న్ ఎయిర్‌పోర్ట్. ఇక్కడి రన్‌వేను రెండు ముక్కలు చేస్తున్నట్లుగా మధ్య నుంచి ఓ రైల్వే ట్రాక్ ఉంది. ఈ విమానాశ్రయాన్ని అటు రైల్వే, ఇటు విమానయాన సేవలకు వినియోగిస్తున్నారు.



న్యూజిలాండ్‌లోని ఉత్తర ద్వీపంలో వున్న గిస్‌బోర్న్ ఓ చిన్న పట్టణం. ఇది సుమారు నూటా అరవై హెక్టార్ల పరిధిలో విస్తరించి ఉంటుంది. ఇక్కడి గిస్‌బోర్న్ విమానాశ్రయం అందర్నీ ఆకర్షిస్తోంది. ఎందుకంటే దీని రన్‌వే మీదుగా పాల్మెరస్టన్ నార్త్-గిస్‌బోర్న్ రైల్వే లైన్ వెళ్తోంది. ప్రతిరోజూ ఉదయం 6.40 నుంచి రాత్రి 8.30 వరకు మాత్రమే ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాట్లో ఉంటుంది. విమానాశ్రయ అధికారులే ఇక్కడి సిగ్నలింగ్ వ్యవస్థను పర్యవేక్షిస్తారు.

ఒకవేళ విమానం టేకాఫ్/ల్యాండింగ్‌కు సిద్ధంగా ఉంటే రైళ్లను కాసేపు నిలిపివేస్తారు. వైమానిక సేవలకే ప్రథమ ప్రాధాన్యమిస్తారు. అంతేకాకుండా వీలైనంత వరకు రైళ్లు, విమానాలు ఒకే సమయంలో రాకుండా టైమ్ టేబుల్ తయారు చేసి దానినే అనుసరిస్తున్నారు. అప్పుడప్పుడూ చిన్న చిన్న మార్పులు జరుగుతుంటాయి. అది సర్వసాధారణం.


ఆస్ట్రేలియాలోని టాస్మానియాలో ఇదే మాదిరి ఒక ఎయిర్ పోర్ట్ ఉండేది. అక్కడి వైన్‌యార్డ్ విమానాశ్రయం రన్‌వే మధ్యలో నుండి లైను వెళ్లేది. అయితే 2005లో ఆ మార్గంలో రైల్వే సేవలను నిలిపివేశారు. దీంతో ప్రపంచంలోనే రన్ వే మీదుగా రైల్వే లైన్ వెళ్తున్న ఏకైక ఎయిర్‌పోర్ట్‌గా గిస్‌బోర్న్ నిలిచింది.

# ముప్పై యేళ్ల తరువాత...

సుమారు ముప్పై యేళ్ల పాటు ఒక పిండం ఈ మధ్యే శిశువుగా పురుడు పోసుకుని ప్రపంచ రికార్డు సాధించింది. ఇంత సుదీర్ఘ కాలం భద్రపరచిన పిండం శిశువుగా మారిన ఉదంతాలేవీ ఇప్పటివరకూ లేవని తెలుస్తోంది. అమెరికాలోని ఒహాయోకు చెందిన లిండ్సే, టిమ్ పియర్స్ జంటకు మగ శిశువుగా ఈ పిండం జన్మించింది. ఈ దంపతులు చాలా కాలం పిల్లల కోసం ప్రయత్నం చేసి ఆ ప్రయత్నాలు ఫలించక పోవడంతో లిండా ఆర్చర్డ్ అనే మహిళకు సంబంధించిన పిండాన్ని తీసుకోవాలని అనుకున్నారు. 1994లో లిండా ఆర్చర్డ్ ఐవీఎఫ్ విధానం ఎంచుకున్నారు. దాంతో వైద్యులు ఆమె అండాలు, ఆమె భర్త వీర్యకణాలతో ఫలదీకరణ చేయించి నాలుగు పిండాలను వృద్ధి చేశారు. ఇందులో ఒక పిండం ద్వారా లిండా ఆర్చర్డ్ ఆడ సంతానం పొందారు. మిగతా మూడు పిండాలను భద్రపరిచారు. ఆ తర్వాత భర్త విడిపోయినప్పటికీ ఆర్చర్డ్ ఆ పిండాలను వదులుకోలేదు. వాటిని భద్రపరిచేందుకు ఆమె చాలా ఖర్చు చేసింది. తర్వాత ఒక క్రిస్టియన్ పిండ దత్తత కేంద్రం వాటి బాధ్యతను స్వీకరించింది. అమెరికాలో ఉండే వివాహిత, శ్వేత జాతి క్రిస్టియన్ జంటకు ఆ పిండాలను ఆర్చర్డ్ నిర్ణయించుకున్నారు. వారు పెట్టిన షరతులు లిండ్సే, టిమ్ జంటకు సరిపోయాయి. దీంతో రెండు పిండాలను లిండ్సే గర్భంలో ప్రవేశపెట్టారు. అందులో ఒకటి మగ శిశువుగా వృద్ధి పొందింది. ఆర్చర్డ్‌కు ప్రస్తుతం అరవై రెండు యేళ్లు. ఆమె కూతురుకు ముప్పై యేళ్లు.







# రామ్‌చరణ్ బుచ్చిబాబు కాంబినేషన్‌లో 'పెద్ది'

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'పెద్ది'. ఈ సినిమాను స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిస్తున్నారు. క్రికెట్, కబడ్డీ, కుస్తీ వంటి స్థానిక ఆటల నేపథ్యంలో సినిమా ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్రంలో చెర్రీ ఆట కూలీ పాత్రలో కనిపించనున్నట్టు సమాచారం. ఇక, ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. చరణ్ మాసీవ్ గెటప్ కూడా సరికొత్తగా ఉండటం సినిమాపై ఆసక్తిని పెంచింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న 'పెద్ది' నుంచి త్వరలోనే ఫస్ట్ లుక్ విడుదల కానుందని సమాచారం. వినాయక చవితి సందర్భంగా వచ్చే నెలలో ఫస్ట్ సాంగ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

ఇప్పుడు ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో రూపొందుతున్న పాటలు పూనకాలు తెప్పించడం ఖాయమని అభిమానులు ధీమాగా ఉన్నారు. ఈ సినిమాలో చరణ్ సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ నటిస్తుండగా వచ్చే ఏడాది రామ్‌చరణ్ బర్త్‌డే సందర్భంగా మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది.

తారాతీరం

# 'రాజాసాబ్'లో సంజయ్‌దత్

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు మారుతి కాంబోలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'రాజాసాబ్'. హారర్ కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే గ్లింప్స్ విడుదల కాగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కాగా, ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్న బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ లుక్ ఒకటి తాజాగా విడుదల చేశారు.

ఆయన బర్త్ డే సందర్భంగా మేకర్స్ 'రాజాసాబ్' నుంచి కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై హైప్ క్రియేట్ చేసేలా ఉంది. భారీగా పెరిగిన తలవెంట్రుకలు, గడ్డంతో సంజయ్ దత్ పాత్ర సినిమాకే హైలెట్‌గా నిలువబోతున్నట్టు తాజా స్టిల్ చూస్తుంటే అర్థమవుతోంది.

ఈ చిత్రంలో, ప్రభాస్ జోడీగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా ఈ సినిమాని నిర్మిస్తున్నారు.





కథ

# గడ్డాలనాటి బిడ్డలు

పి.రాజేంద్రప్రసాద్

"ఏమోయ్! టైమౌతోంది. రెడీ అయ్యావా?" హాల్లోంచి కేక వేశాడు విశాల్.

"అయిపోయిందండీ! చివరికొచ్చింది. టు మినిట్స్" కిచెన్ లోపల్నుంచే జవాబిచ్చింది జ్యోత్స్న.

"మా గురించి ఎందుకమ్మా శ్రమ? మీరు వెళ్లాక అంతా ఖాళీయేగా! ఆ మాత్రం వంట నేను చేసుకుంటానంటే వినదే వినదు" అభిమానంగా అన్నది అన్నపూర్ణ.

"అమ్మా! నువ్వేమంత వర్రీ కావద్దు. మీ కోడలేమన్నా స్టవ్ దగ్గరే కూర్చోవాలా! అన్నీ కలిపేసి ఓవెన్‌లో పెడితే అదే అయిపోతుంది. మీరు పుస్తకాలు చదువుకోండి. టీవీ చూసుకోండి. లేదంటే మీకు ఇష్టమైన పాటలు వినండి. మధ్యాహ్నం భోజనం చేసి పడుకోండి. మీరు లేచేసరికి మేమిద్దరం వచ్చేసి మీకు సాయంకాలం టీ ఇస్తాం" అన్నాడు విశాల్.

"అలా కాదు బాబూ! పిల్లాడినన్నా మేం చూసుకుంటామంటే మీరు ఒప్పుకోవడం లేదు" నిష్ఠూరంగా అన్నాడు వీరభద్రం.

"వాడికోసం శాంత ఉంది కదా నాన్నగారూ! మీరేం వర్రీ కానవసరం లేదు. ఈ వయసులో మీరు వాళ్లకి కథలూ, మాకు అవసరమైన సలహాలూ చెప్తూ ఉంటే చాలు. ఇంకేమీ చెయ్యక్కరలేదు" నవ్వుతూ చెప్పాడు విశాల్.

మరో పది నిమిషాలకు ఇద్దరూ రెడీ అయ్యారు.

"అమ్మా! నిహాల్ ఇంకా లేవలేదు. శాంత బయటే కూర్చుని ఉన్నది. వాడు లేస్తే తను చూసుకుంటుంది. మేమిద్దరం ఆఫీసుకు వెళ్ళొస్తాం..బై..!" అంటూ బయలుదేరారు.

జ్యోత్స్న, విశాల్‌లకు ఒక్కడే కొడుకు నిహాల్. ఒకటిన్నర సంవత్సరాల వయసువాడు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేస్తున్న కారణంగా వాడిని చూసుకోవడానికి పనమ్మాయిని పెట్టారు.

విశాల్ వాళ్ల నాన్నగారూ అమ్మగారూ ఈ మధ్యనే ఇక్కడికి వచ్చారు. "ఇక మీరు వేరే ఎక్కడా ఉండవద్దు, పర్మనెంటుగా ఇక్కడే ఉండాలి" అని విశాల్, జ్యోత్స్నల ఆర్డర్. వాళ్ళిద్దరినీ అసలు ఏ పనీ చెయ్యనివ్వడం లేదు. వాళ్లు తమ మీద చూపిస్తున్న ఆదరాభిమానాలకు వీరభద్రం, అన్నపూర్ణలు ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నారు.

.................


రాహుల్ ఆఫీసుకు బయలుదేరబోతూ ఉంటే ఫోన్లో మెసేజ్ సౌండ్ వచ్చింది. జేబులోంచి ఫోన్ తీసి చెక్ చేసుకున్నాడు. మెసేజ్ చూసి భ్రుకుటి ముడిచాడు. "ఇదేమిటి? 30,000 రూపాయలు నా అకౌంటులోకి రివర్స్ అయ్యాయా? ఎందుకు? ఏమోలే ఖాళీ దొరికాక ఫోన్ చేసి కనుక్కోవచ్చు" అనుకుంటూ కార్ స్టార్ట్ చేశాడతను.

.................

"విజయా! నా అకౌంటులోకి అనుకోకుండా పదిహేను వేలరూపాయలు రివర్స్ అని చూపిస్తోంది మెసేజ్" దాదాపు అరుస్తున్నట్టే అన్నాడు మాధవ్ ఫోన్ చూసుకుంటూ.

"ఎక్కడినుంచండీ?" అడిగింది శ్రీమతి.

"ఏమో మరి! రివర్సల్ అంటే మనం కట్టిన డబ్బులే వెనక్కి వచ్చాయని అర్థం. అలా వృద్ధాశ్రమానికి తప్ప ఎవరికీ కట్టలేదు కదా! వాళ్ళు ఎందుకు రివర్స్ చేస్తారు?" హడావుడిగా ఆఫీసుకు బయలుదేరుతూనే కొద్దిసేపు ఆలోచించి ఆ విషయం గురించి వదిలేశాడు మాధవ్.



.....................

ఇలాగే శివరామ్‌కీ, రాఘవరావుకీ, ఆనంద్‌కీ, విజయ్‌కీ, ఆదిత్యకీ ఇంకా చాలా మందికి అదే విధంగా ఒక్కొక్కళ్లకీ పదిహేను వేల చొప్పున, కొంతమందికి ముప్పై వేల చొప్పున అకౌంటులోకి రివర్స్ అయ్యాయి. చాలా మంది బిజీ లైఫ్‌లో "తరువాత చూసుకుందాంలే" అని పట్టించుకోలేదు. కొద్ది మందికి ఈ వ్యవహారమేదో వింతగా తోచి బ్యాంకు స్టేట్‌మెంట్ డౌన్‌లోడ్ చేసుకుని పరిశీలిస్తే అవన్నీ వృద్ధాశ్రమం నుంచి రివర్స్ అయినట్టు తెలిసింది. వెంటనే వృద్ధాశ్రమానికి ఫోన్ చేశారు.

"మీ తాలూకు వృద్ధులు ఇక్కడ ఎవరూ లేరు సార్. అందువల్ల ఆ పేమెంట్‌ను మేమే వెనక్కి పంపించాం" ఇదీ అక్కడ నుండి వచ్చిన సమాధానం.

రాహుల్‌కి ఏమీ అర్థం కాలేదు.

"మా అమ్మా, నాన్నగార్లు వీరభద్రం, అన్నపూర్ణలు మీ ఆశ్రమంలో ఉన్నారు కదా?" అన్నాడతను సందేహంగా.

"అదే సార్ చెప్తున్నది. వాళ్ళు ఆశ్రమం ఖాళీ చేసి వెళ్లిపోయారు"

"అలా ఎలా? వాళ్ళని చేర్పించింది మేం కదా! మా అనుమతి లేకుండా వాళ్లు అలా ఎలా వెళ్లిపోతారు?" కోపంగా అడిగాడు రాహుల్.

"సార్! అవేవీ మాకు తెలీదు. వాళ్ళు చిన్నపిల్లలూ, మైనర్లూ కాదు. అయినా ఇవన్నీ ఫోన్‌లో చెప్పడం కుదరదు. మీకు వివరాలు పూర్తిగా కావాలంటే ఆశ్రమానికి రండి" అంటూ అతను రావాల్సిన తేదీ, టైమూ చెప్పాడు ఆ గుమస్తా.

ఇలాగే చాలామంది ఫోన్లకు అందరికీ దాదాపు ఇలాగే సమాధానం చెప్పి అందరికీ రావాల్సిన తేదీ, సమయం చెప్పాడు.

రాహుల్, వాళ్ల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడదామని ప్రయత్నించాడు.

కానీ వాళ్లు తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసినట్టు అర్థమయ్యింది.

ఆనంద్, ఆదిత్య, ఇలాగే మిగతావాళ్ల పరిస్థితి కూడా అంతే అయ్యింది.

**"మీ తల్లిదండ్రులు ఆశ్రమం ఖాళీ చేసి వెళ్లిపోయారు" "అలా ఎలా? వాళ్ళని చేర్పించింది మేం కదా! మా అనుమతి లేకుండా వాళ్లు అలా ఎలా వెళ్లిపోతారు?" కోపంగా అడిగాడు రాహుల్.**

చెప్పిన తేదీ సమయం ఆదివారం సెలవురోజు అవ్వడంతో అందరూ ఆ టైముకు వృద్ధాశ్రమానికి వచ్చారు.

దాదాపు పదిహేను నుండి, ఇరవైమంది దాకా వచ్చిన వారందరికీ ఒక విచిత్రమైన దృశ్యం ఎదురయ్యింది.

వృద్ధాశ్రమంలో ఒకరిద్దరు కొత్తగా చేరిన వృద్ధులు తప్పితే దాదాపు మొత్తం ఖాళీగా ఉంది. వాళ్ళు చేర్పించిన వృద్ధులు ఎవరూ వృద్ధాశ్రమంలో కనపడటం లేదు.

మొదటగా రాహుల్ అడిగాడు "మా అమ్మ అన్నపూర్ణ గారు, మా నాన్నగారు వీరభద్రం గారు, ఇద్దరూ మీ ఆశ్రమంలో కనబడడం లేదు. చేర్పించిన మాకు తెలియపరచకుండా మీరు వారిని ఎలా బయటకు పంపించారు? ఎక్కడికి పంపించారు?" తీవ్ర స్వరంతో అడిగాడు.

ఆశ్రమ అధికారి నారాయణరావు చిరునవ్వు నవ్వి "ఆవేశపడకండి సార్! మీ తల్లిదండ్రులను మీరు వెంట ఉండి తీసుకు వచ్చారు. కాదనడం లేదు. కానీ చేర్చుకునేటప్పుడు కేవలం మీ తల్లిదండ్రుల ఆమోదం మాత్రమే తీసుకున్నాం. మీ సంతకం కాదు.

వారికి ఆరోగ్య విషయంలోగానీ, మరే విషయంలోగానీ వారంతట వారు చేసుకోలేకపోతే ఎవరికి చెప్పాలి? అని మాత్రమే మీ పేర్లు, అడ్రసులు తీసుకున్నాం. ఆశ్రమం తాలూకు నియమాల కాపీని మీకు కూడా ఇచ్చాం. ఒకసారి చెక్ చేసుకోండి" అని అన్నాడు.

"అయితే చేర్పించిన మాకు ఏమీ సంబంధమే లేదా! డబ్బులు మేమే కడుతున్నాం కదా!" ఆదిత్య అనే అతను కోపంగా అన్నాడు.

దానికి నారాయణరావు ప్రశాంతంగా జవాబిచ్చాడు.. "సార్! కోప్పడి ప్రయోజనం లేదు. డబ్బుల సంగతి ఏమిటంటే వారికి అయ్యే ఖర్చు తాలూకు డబ్బు మీరే కట్టాలని లేదు. ఎవరు కట్టినా ఒకటే. అంతమాత్రాన వారి మీద మీకు హక్కు ఉండబోదని మీ తల్లిదండ్రులు మా చెంప ఛెళ్లుమనేలా జవాబిచ్చి వెళ్లిపోయారు.

మీ తల్లిదండ్రులు వారి ఇష్టం మీద ఇచ్చిన డిక్లరేషన్లు ఇవిగో చూడండి" అంటూ ఒక్కొక్కరికీ వారి వారి తల్లిదండ్రులు వారి ఇష్ట ప్రకారమే వెళ్లిపోతున్నట్టు రాసి ఇచ్చిన కాగితాలు వారి చేతికి అందించాడు.

అందరి ముఖాలూ కత్తివాటుకు నెత్తురు చుక్క లేనట్టు పాలిపోయాయి.

"అయితే ఇంతకీ వారెక్కడికి వెళ్లినట్టు?" రాఘవరావు అడిగాడు.

"ఆ సంగతి మాత్రం అడగవద్దు సార్. వాళ్ళు చెప్పవద్దన్నారు. వాళ్లు మీకే డైరెక్ట్‌గా తెలియచేస్తామని చెప్పమన్నారు" ఇంకా చెప్పవలసింది ఏమీ లేదన్నట్టు కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు నారాయణరావు.

వచ్చిన అందరి మనసుల్లో కోటి సందేహాలున్నా ప్రస్తుతం చేయగలిగింది ఏమీ లేక అందరూ తమ తమ ఇళ్లకు వెనుతిరిగారు.

..............

ఇళ్లకు వెళ్ళినవాళ్లు తమ తల్లిదండ్రులకు ఫోన్లు చేసీ చేసీ అలసిపోయారు. మొత్తం అందరు పెద్దవాళ్ళూ తమ పిల్లల ఫోన్ నంబర్లను బ్లాక్ చేసి పెట్టారు.

ఇలాగ దాదాపు నెల రోజులు గడిచాయి. అందరు పెద్దవాళ్ళూ తమ ఇష్టప్రకారమే వెళుతున్నామని రాసి ఇచ్చిన పేపర్లు ఉండగా పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చినా తీసుకోరు.

ఈ విషయం గ్రహించుకున్న పిల్లలు తమ ప్రయత్నాలు మానుకోవాల్సి వచ్చింది. వారందరికీ ఇప్పుడు ఒకటే బాధ. తమ బంధువులలో ఈ విషయం తెలిస్తే తమ పరువు పోతుందని.

......................

రోజులు గడుస్తూ ఉన్నాయి.

రాహుల్, ఆదిత్య, రాఘవరావు తదితరులను వారి బంధువులు రాక్షసులలాగా చూస్తూ ముఖ్యమైన కార్యక్రమాలకు వారిని పిలవడం మానివేశారు. తల్లిదండ్రులు ఉండి కూడా లేకుండా పోయిన వారినందరినీ చాలా మంది తిరస్కారంతో చూడసాగారు.

ఇదంతా వాళ్ళ మనసుపై తీవ్ర ప్రభావం చూపి వాళ్లంతా మానసికంగా కుంగిపోయారు.

ఇలాంటి సమయంలో ఒక రోజున ఫేస్ బుక్‌లోనూ, ఇన్స్టాలోనూ, ఇంకా రకరకాల మాధ్యమాలలో ఒక అడ్వర్టైజ్మెంట్ వచ్చింది.

"బిల్డింగ్ స్టెప్స్ .."

మీ జీవితాలను స్టెప్ బై స్టెప్ ఎలాగ బిల్డ్ చేసుకోవాలో తెలియచెప్పే సంస్థ. ఒక్కసారి మమ్మల్ని కన్సల్ట్ చేస్తే మీ జీవితంలోని అన్ని రంగాలలో విజయం సాధించటం ఎంతో సులభం అంటూ.

దీనిని ఎవరూ ఎక్కువగా పట్టించుకోలేదు.

కానీ ఒకరోజు ఆదిత్య ఫేస్ బుక్ చూస్తూ ఉండగా అందులో వచ్చిన ఒక వార్త చాలా ఆకర్షించింది.

అదేమిటంటే.. అనేక రంగాలలో అపూర్వ విజయాలు సాధించిన సీనియర్ సిటిజన్స్‌చే స్థాపించబడిన సంస్థ బిల్డింగ్ స్టెప్స్ సంస్థకు రాష్ట్రపతి నుండి ప్రశంసా పత్రం వచ్చింది.

సామాజిక మాధ్యమాల్లో ఎక్కడ చూసినా "బిల్డింగ్ స్టెప్స్" సంస్థ గురించి పొగడ్తలే.

ఆదిత్య ఈ వార్తను చదువుతూ ఉండగానే అతనికి, అతనిలాగ ఇంతకు ముందు తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలిన ఇతరులకూ ఒక యూ ట్యూబ్ లింక్ వచ్చింది.

వాళ్లందరూ దానిని ఓపెన్ చేసి ఆ వీడియోను చూడసాగారు.

అపూర్వమైన సేవలందించి అచిర కాలంలోనే ఎంతో మంది ఔత్సాహిక ఎంటర్ప్రెన్యూర్‌లను తయారు చేసిన సంస్థగా బిల్డింగ్ స్టెప్స్ అధ్యక్షుడైన వీరభద్రంగారికి కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రం వచ్చింది. ఆ ఆనందంతో వారంతా సంబరాలు చేసుకుంటూ ఉన్నారు.

అంతలో స్క్రీన్ మీదకు వీరభద్రం గారు వచ్చారు.

"బాబూ! మీరంతా మమ్మల్ని పనికి రాని స్క్రాప్‌గా భావించి ఇంట్లో మేముంటే మాకు సేవ చేయాల్సి వస్తుందని, మా కృషి ఫలితంగా మీరు సంపాదించిన డబ్బుతో మమ్మల్ని వదిలించుకున్నారు. కానీ ఒక్కరోజు వృద్ధాశ్రమానికి వాళ్ల అబ్బాయి పుట్టిన రోజుకి మాకు స్వీట్స్ పంచుదామని వచ్చిన విశాల్ మా జీవితాల లోతుల్లోకి చూడగలిగాడు.

తనతో పాటు తన ఇరుగు–పొరుగులకు ఇదంతా చెప్పి మమ్మల్ని ప్రేమతో అందరూ దత్తత తీసుకునేలా చేశాడు. మమ్మల్ని వాళ్ళు ఏ రోజూ ఏ పనీ చేయమనలేదు. కానీ ఊరికే ఖాళీగా ఉండలేక ఈ సంస్థ స్థాపించదలుకుంటే వీళ్ళందరూ మాకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించారు. వృద్ధాశ్రమంలో ఎవరూ లేక, ఒంటరివారిగా కుంగిపోయే మమ్మల్ని గర్వంగా తలెత్తుకునేలా చేశారు. మీరంతా అద్దాలనాడు మా బిడ్డలు. కానీ వీళ్లంతా మాకు గడ్డాలు పెరిగాక వచ్చిన బిడ్డలు. మాకు వీళ్లే కావాలి. ఈ విషయం మీకు తెలియడం కోసమే మీకు ఈ వీడియో పంపుతున్నాం.

ఎండిపోయిన మొక్కకు నీళ్లు పోస్తే చిగురించదు. పగిలిపోయిన అద్దం మునుపటిలా ప్రతిబింబాన్ని చూపించలేదు. మళ్ళీ మేం మునుపటిలా మీ దగ్గరకు వస్తామని అనుకోకండి. ఎప్పుడో ఒకప్పుడు మా

**"బిల్డింగ్ స్టెప్స్ .." మీ జీవితాలను స్టెప్ బై స్టెప్ ఎలాగ బిల్డ్ చేసుకోవాలో తెలియచెప్పే సంస్థ. ఒక్కసారి మమ్మల్ని కన్సల్ట్ చేస్తే మీ జీవితంలోని అన్ని రంగాలలో విజయం సాధించటం ఎంతో సులభం.**

కన్నపేగు కదిలినప్పుడు మిమ్మల్ని కూడా చూడడానికి వస్తాం. అంతేకానీ మళ్ళీ మీ దగ్గరే ఉంటామని ఊహించుకోకండి.

ఇప్పటికైనా మీరు కోల్పోయిందేమిటో తెలుసుకొని మీ పిల్లలు మిమ్మల్ని నిరక్ష్యం చెయ్యకుండా పెంచుకోండి" అంతటితో స్క్రీన్ బ్లాక్ అయిపోయింది.

భారమైన గుండెలతో రాహుల్, ఆదిత్యా తదితరులు తమ పిల్లలు తమని ఈ విధంగా నిరక్ష్యం చెయ్యకుండా ఉండాలంటే ఏ విధంగా పెంచాలీ..? అనే ఆలోచనలో పడ్డారు.

✦


## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com


చదువులన్నిటికీ కిరీటం లోకజ్ఞానం. సరైన పని చేయడమే కాదు, సరైన సమయంలో, సరైన చోట చేయాలి. నైపుణ్యం వల్ల ఏం చేయాలో తెలుస్తుంది. లౌక్యం వల్ల ఎప్పుడు, ఎలా చెయ్యాలో తెలుస్తుంది.

– విలియం మాథ్యూస్

మూన్నాళ్ల ముచ్చటను చూసి మురిసిపోకు. శాశ్వతమైన దైవ సంబంధాన్ని మరచిపోకు. అద్దె కొంపను సింగారించటంలోనే మునిగిపోయి స్వంత కొంప కూలిపోనీయకు.

– కొల్లిపర పాండురంగారావు

# ఊయల ఊసులోనే తెలుగు సొగసు

తెలుగు ప్రజల భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు వివిధ రంగాలలో సాధించిన ఘన విజయాలను విశదం చేసే పూర్వపు గ్రంథాలు అనేకం ఉన్నాయి. 1975వ సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతి సంవత్సరంగా నాటి ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ తెలుగు మహాసభలు వేదికగా తెలుగు భావ సమైక్యత ప్రాతిపదికగా, సమైక్యంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడాలని నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, విద్యాశాఖామంత్రి మండలి వెంకట కృష్ణారావు వంటి 44 మంది ప్రముఖ సభ్యులతో ఏర్పడిన విద్వత్ సంఘం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా వ్యవహరించిన దేవులపల్లి రామానుజరావు వంటి పెద్దలతో వివిధ చైతన్య ప్రవంతులను ఏకోన్ముఖం చేసి సాంస్కృతిక సంబంధాలు దృఢతరం చేసే మహాసభలు నిర్వర్తించింది.

రెండు వేల అయిదు వందల సంవత్సరాల తెలుగు జాతి సమున్నత చరిత్రలో ఎన్నో మరపురాని మధుర ఘట్టాలు వున్నాయి. హిందీ మాట్లాడేవారి తర్వాత అగ్రస్థానంలో ఉన్న తెలుగువారు, బౌద్ధ పూర్వయుగం నుంచి, ఆంగ్ల సామ్రాజ్య పరిపాలనా కాలం వరకూ పెద్ద ఎత్తున ప్రపంచం నలుమూలలకు వలస వెళ్లి, తమ భాషా, సంస్కృతి, సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి సుసంపన్న గాథలతో అంతర్జాతీయ సంబంధ బాంధవ్యాలను నెలకొల్పారు.




1975 నుంచి 2025 వరకు ప్రస్థానంలో, దేశంలో, రాష్ట్రంలో జాతీయ అంతర్జాతీయ చారిత్రక పరిణామాల నేపథ్యంలో ఎన్నో పెనుమార్పులు సంభవించాయి. ప్రధానంగా జీవనశైలి మార్పుతో పాటు సాంకేతిక యుగం ఆవిర్భవించింది. కానీ గత అర్ధ శతాబ్దిగా మేధావంతులైన రచయితలు, పండితులు తమ కలాలకు పదును పెడుతూనే ఉన్నారు. వివిధ ప్రక్రియలలో పుంఖాను పుంఖాలుగా గ్రంథాలు వెలువడుతున్నాయి. పాత కొత్తల మేలు కలయిక క్రొమ్మెరుంగులు ప్రసరింప చేస్తూనే ఉంది. కానీ ప్రాచీన గ్రంథాలలో నిక్షిప్తమై ఉన్న అపూర్వ జ్ఞానసంపద నిర్లక్ష్యానికి గురి అవుతోంది. డిజిటల్ యుగ మేధావులు ఎంత సత్కృషి కొనసాగిస్తున్నా, గ్రంథాలయాల లోని అపూర్వ సాహిత్యం, కాలగర్భంలో కనుమరుగయ్యే విపత్కర స్థితిగతులు చోటు చేసుకొన్నాయి. అదేవిధంగా కొన్ని ఇంటింటా స్వతంత్ర గ్రంథాలయాలలో అక్కడక్కడ అమూల్య గ్రంథాలున్నాయి. 'పాత రోత', 'కొత్త వింత' దృక్పథంతో సాగుతున్న సమాజంలో సహజంగా, 'వినియోగం–విసిరి వేయడం' సర్వత్రా నెలకొని ఉండడంతో భావ సంపద కూడా అదే దుస్థితి ఎదుర్కొంటోంది. అదృష్టవశాత్తు దక్షిణాది రాష్ట్రాలలో ఇంకా భాషాభిమానం కొంతైనా సజీవంగా ఉంది. ప్రాంతీయత పట్ల, స్థానిక మాండలిక ధోరణుల పట్ల, అస్తిత్వ ప్రేమాభిమానాలు, అంతగా కాకపోయినా వ్యక్తం అవుతున్నాయి. భాష సజీవంగా ఉండాలంటే పుస్తకాలు బతకాలి. యువతరం పుస్తకాలను అభిమానించాలి. బాలబాలికలకు పుస్తక పఠనం అలవాటు చేయాలి. కేవలం ఆంగ్లం కాకుండా, మాతృభాషలను, పిల్లల స్థాయికి తగ్గ అభిమానం అభిరుచి కలిగించే విద్యా విధానం ప్రవేశపెట్టాలి. పలక, బలపం, కాగితం రోజులు కావివి. నిజమే! పిల్లలకు ల్యాప్‌టాప్‌లతో పాటు పుస్తకం చదవడం, రాయడం అదీ ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ సంబంధితంగా విద్యా విధానంలో తప్పనిసరి చేయాలి. ఒత్తిడి తెస్తే కానీ ప్రభుత్వం ఏ సత్కార్యం తలపెట్టదు.

రెండు తెలుగు రాష్ట్రాలలో, తల్లిభాషను ప్రేమించే, అభిమానించే పాఠకులు, రచయితలు, సంస్కారవంతులు కోకొల్లలుగా ఉన్నారు. సంఘాలున్నాయి. ఇంకా ప్రచురణలు కొనసాగుతున్నాయి. నిర్లిప్తత, నిర్లక్ష్యం, తత్కాలత తల్లినుడిని దూరం చేస్తోంది. తల్లి నుడి తర్వాతే ఆంగ్లమైనా, హిందీ అయినా అనే భావన ప్రగాఢంగా ప్రచారం కావాలి. ప్రస్తుత విద్యా విధానంలో అమ్మ భాష పట్ల నిరాదరణ చాప కింద నీరులా పాకుతోంది.

ప్రభుత్వ కార్యాలయాలలో, పారిశ్రామిక వ్యాపార సంస్థలలో, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలంటే మాతృభాష కనీసం ప్రాథమిక పరిచయం తప్పనిసరి చేయాలి. అది ప్రభుత్వాధినేతలే చేయగలరు. గ్రంథాలయాలు ప్రస్తుతం ఉన్నా, ఈసురోమనే దశకు చేరుకొంటున్నాయి. మేధావంతులైన తల్లిదండ్రులు, రచయితలు, కవులు, పండితులు కూడా గ్రంథాలయాలకు వెళ్లడం లేదు. విద్యా సంస్థలలో లైబ్రరీ పీరియడ్‌లు ప్రవేశపెట్టి బాలబాలికలకు పుస్తక పరిచయాలు, యువతరానికి పోటీలు గ్రంథాలపై చర్చలు, గోష్ఠి కార్యక్రమాలు నిర్వహింప చేయాలి. ఉద్యోగాలు, ఉపాధి కల్పనావకాశాలు పేరిట ప్రభుత్వాలు ఎంత సంపన్న సమాజాన్ని ప్రలోభించినా ప్రకృతి వెలుగు, వెన్నెలతో పోల్చలేం. అమ్మ కడుపులో జనించే అమృతభావనతో ఏదీ సరికాదు.

- జయసూర్య

# కోరికలు తీర్చే సరస్వతి

పిల్లల అక్షరాభ్యాసానికి, విద్యాభివృద్ధికి పనచ్చిక్కాడు సరస్వతి అమ్మవారి కృప ఎంతో అవసరం. కేరళ రాష్ట్రంలో కొట్టాయం నుండి సంగనాచ్చేరి వెళ్లే దారిలో పదకొండు కిలోమీటర్ల దూరంలో సింగవనం అనే ప్రదేశానికి దగ్గర్లో పనచ్చిక్కాడు ఉంది.

దాదాపు ఆరు వందల సంవత్సరాల క్రితం కేరళలో పనచ్చిక్కాడు అనే చోట దామోదర నంబూద్రి అనే ఆయన ఉండేవారు. ఆయనకు పిల్లలు లేరు. ఆయన అక్కడున్న విష్ణువు ఆలయంలో తనకు పిల్లలు కావాలని కోరుతూ పూజలు చేస్తూ వచ్చారు.

కాలం గడుస్తూ వచ్చింది. ఓ రోజు ఆయనకు ఓ కల వచ్చింది. ఆ కలలో "కొల్లూరు మూకాంబికా దేవాలయానికి వెళ్లి వేడుకుంటే నీ కోరిక నెరవేరుతుంది" అని ఆ కలలో ఓ అశరీర వాణి మాట వినిపించింది. ఆ తర్వాత దామోదర నంబూద్రి ఏటా మూకాంబికా దేవి ఆలయానికి వెళ్లి వస్తూ తనకు సంతానం కలిగించవలసిందిగా ప్రార్థించారు. ఇలా ఆయన ఓసారి కొల్లూరు వెళ్లి అంబిక సన్నిధిలో ప్రార్థించి పనచ్చిక్కాడుకి తిరిగి వస్తుంటే అప్పుడు విష్ణువు ఆలయానికి దక్షిణ దిశలో ఉన్న ఓ కోనేరు కనిపించింది.

ఆ కోనేరు ఒడ్డున తన గొడుగును వుంచి కోనేరులో దిగి స్నానం చేసాడు. ఆ తర్వాత ఒడ్డుకొచ్చి గొడుగు తీసుకుందామంటే ఆయన వల్ల కాలేదు. "అదేంటి? గొడుగు తీయలేకపోతున్నానని" అనుకుని పలుసార్లు ప్రయత్నించారు. అయినా లాభం లేకపోయింది.



ఇంతలో "దామోదరా, నువ్వు పిల్లల కోసం మొక్కుకుంటున్నావు. నీకు పిల్లలు లేరని బాధపడకు. జగద్గురువు ఆదిశంకరులవారు ఇక్కడి మూకాంబికను కొల్లూరుకు తీసుకుపోయి అక్కడ పూజించడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఆమె రూపమైన సరస్వతి నీ గొడుగులో ఉండి ఇక్కడికి నీతో వచ్చింది. నువ్వు ఇక్కడి అడవిలోకి వెళ్లి చూడు.. అక్కడ నీకు శిశువు రూపంలో ఉన్న సరస్వతీదేవి విగ్రహం కనిపిస్తుంది. దానిని ఈ స్థలంలో ప్రతిష్ఠించి పూజించడం మొదలుపెట్టు" అని ఆయనకు ఆకాశవాణి మాటలు వినిపించాయి.

ఆ మాటలు విన్న నంబూద్రి అశరీరవాణి చెప్పిన దిశలోనే పయనించి అడవిలోకి వెళ్లి చూశారు. ఆయనకు ఆశ్చర్యం వేసింది. అశరీరవాణి చెప్పిన చోట శిశువు రూపంలో వున్న సరస్వతి అమ్మవారు విగ్రహం కనిపించింది. ఆ విగ్రహాన్ని తీసుకొచ్చిన నంబూద్రి తాను కోనేరు ఒడ్డున పైకి తీయలేకపోయిన గొడుగున్న స్థలంలో ఆ సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజించడం మొదలు పెట్టారు. అప్పటి నుంచి ఎందరో భక్తులు ఆ అమ్మవారికి పూజలు చేస్తున్నారు.

నంబూద్రి పూజిస్తూ వచ్చిన సరస్వతి విగ్రహం చుట్టూ ఇప్పుడు తమలపాకు తీగలు విస్తరించి ఉన్నాయి. దీనికి అడుగు భాగంలో మూకాంబికా దేవి ఆలయంలో సరస్వతి ఉద్భవించిన గొడుగు ఉంది. దీనిని అందరూ దర్శించుకోవచ్చు. కానీ సరస్వతి శిశువు రూపంలో ఉన్న విగ్రహాన్ని చూడలేరు. 'సరస్' అంటే నీరు. 'వతి' అంటే దేవి అని అర్థం. దీనికి తగినట్లే ఈ ఆలయాన్ని ఓ సరస్సు ఆవరించి ఉందని భక్తులు అంటారు.

ప్రస్తుతం బావి లాంటి లోయలో ఉన్న దేవిని చూడడానికి వీలు కాదు కనుక భక్తుల దర్శనం కోసం ఇక్కడి పశ్చిమ దిశను చూస్తున్నట్లుగా ఓ రాతిని నెలకొల్పి దాన్ని సరస్వతిగా అలంకరించి పూజిస్తున్నారు. ఈ ఆలయంలో ఉన్న సరస్వతీ దేవి కొల్లూరు నుంచి దక్షిణం నుంచి వచ్చి ఆలయంలో వాసముండడంతో ఈ మూకాంబికను దక్షిణ మూకాంబిక అని వ్యవహరిస్తున్నారు.

ఈ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ ఉత్సవాలప్పుడు సరస్వతి దేవిని శిశువు రూపంలో అలంకరించి పూజిస్తారు. నవరాత్రి సమయంలో చివరి రోజైన దశమినాడు భక్తులు భారీ సంఖ్యలో ఇక్కడికి తరలి వచ్చి సరస్వతికి పూజలు చేస్తుంటారు. ఆ రోజున పెద్దలు తమ పిల్లలతో వచ్చి అమ్మవారి సన్నిధిలో తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేసిపోతారు.

కొందరు తమ పిల్లలతో వచ్చి వారి పలకా, పుస్తకాలను అమ్మవారి సన్నిధిలో ఉంచి ఆరాధిస్తారు. నృత్య, సంగీత కళా రంగాలకు చెందిన ప్రముఖులు ఎందరో ఇక్కడికి వచ్చి అమ్మవారిని పూజించి ఆశీస్సులు పొందడం ఎప్పుడూ కనిపించే దృశ్యమే. పిల్లలు లేని దంపతులు ఇక్కడి ఆలయానికి వచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకుని దేవికి మధ్యాహ్నపు పూజలు నివేదించే పాలు, చక్కెర, పచ్చి బియ్యం కలిపి చేసిన పాయసాన్ని ప్రసాదంగా స్వీకరిస్తే వారి కోరిక తీరి పిల్లలు పుడతారని ఆస్తికులు విశ్వాసం.

**- యామిజాల జగదీశ్**

## వాస్తువార్త


**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్స్: 9885446501/9885449458




# స్థలం వాస్తుకు అనుకూలంగా ఉందా?

**ఎన్.కె, కర్నూలు**


**ప్రశ్న:** మాకు కర్నూలులో ఒక స్థలమున్నది. స్థలం చతురస్రాకారంలో ఉన్నది. పడమర వైపు రోడ్డు, ఉత్తరాన ఇంటి స్థలాలు, తూర్పుకు దక్షిణం నుంచి ఉత్తర దిశగా పారుతున్న మురికి కాలువ ఉన్నాయి. దక్షిణంలో పడమర నుంచి తూర్పు దిశగా పారుతున్న కె.సి.కెనాల్(రెండు ఇళ్ల తరువాత)గా ఉన్నాయి. నేను పంపిన స్థలం పటం చూసి వాస్తు విషయాలు వివరించగలరు.

**జవాబు:** మీరు చెప్పిన వివరాలను బట్టి క్షేత్రం పరిసరాలు తూర్పు దిక్కుకు, ఉత్తర దిక్కుకు పల్లంగా ఉన్నాయి. తూర్పున వున్న కాలువ ఉత్తరాభిముఖంగా పారడం మంచిదే. దక్షిణాన ఉన్న కాలువ తూర్పుకు అభిముఖంగా పారడం మంచిదైనప్పటికీ, దక్షిణాన నీటికాలువ ఉండటం (రెండు ఇళ్ల తరువాత అయినా కూడా) వాస్తుకు ప్రతికూలంగానే చెప్పుకోవచ్చు. ఇలా ఈ స్థలం అనుకూలంగానూ, ప్రతికూలంగానూ అంటే 'మిశ్రమ ఫలితాలు' ఇచ్చేదిగా ఉంది. ఇలాంటి స్థలాలలో 'చక్కటి వాస్తు'తో ఇల్లు కడితే చెడు ఫలితాలు తగ్గుతాయి. అంటే మిశ్రమ ఫలితాలలో ఎక్కువ మంచి ఫలితాలను ఆశించవచ్చు.

### సమస్యలు తీరేదెలా?

**బి.కళావతి, విజయనగరం**

**ప్రశ్న:** ఇప్పుడుంటున్న ఇల్లు **2000** సంవత్సరంలో కట్టుకున్నాం. అది కట్టుకున్నాక మంచి ఫలితాలు అనుభవించాం. **2007**లో పక్కన ఖాళీ స్థలంలో పునాదులతో నా సోదరి దగ్గర కొన్నాం. తరువాత ఆస్తులు పోయి, రుణబాధలు ఎక్కువయ్యాయి.



సంతానం వల్ల ముఖ్యంగా కనిష్ట సంతానం వల్ల మనశ్శాంతి లేదు. తూర్పు వైపు స్థలం కొంటే బాగుంటుందని అంటారు. కానీ మాకు బాగుండలేదు. ఈ సమస్యకి పరిష్కారం తెలుపగలరు.

**జవాబు:** ఒక గృహానికి ఆనుకుని తూర్పు లేదా ఉత్తర దిక్కుల్లో ఖాళీ స్థలం కొనవచ్చు. అది వాస్తు నియమాలకు వ్యతిరేకం కాదు. అయితే ఆ స్థలం స్వరూపం, స్వభావాలు ఎలా ఉన్నాయో కూడా గుర్తించిన తరువాతనే కొని కలుపుకోవాలో, వద్దో నిర్ణయించుకోవలసి ఉంటుంది. ఆ స్థలాల స్వరూప, స్వభావాలు చెడు ఫలితాలు ఇచ్చేవిగా ఉంటే వాటిని కొని కలుపుకోవటం వల్ల చెడు ఫలితాలే కలుగుతాయి. అవి మంచి ఫలితాలనిచ్చేవిగా ఉంటే వాటిని కొని కలుపుకోవటం వల్ల మంచి ఫలితాలు కూడా కలుగుతాయి. అటువంటి సందర్భాలలో స్థలాన్ని ప్రత్యక్షంగా చూసి చెప్పడం మంచిది.

### పాముపుట్ట ఉంది..?

**ఎస్.పి.రావు, హైదరాబాద్**

**ప్రశ్న:** నాకు నలుచదరం గల తూర్పు, ఉత్తర ముఖాలతో చక్కటి స్థలం ఉన్నది. దానికి తూర్పు వైపు **30** అడుగులు, ఉత్తరం వైపు **20** అడుగుల వీధులున్నాయి. తూర్పు వైపు ఉన్న వీధిలో రోడ్డుకు అవతలి వైపు పాముపుట్ట ఉన్నది. దీనివల్ల ఏమయినా దోషం ఉందా? నివారణ ఏమిటి? స్థలానికి నాలుగు వైపుల గోడ కట్టి గేటు పెట్టాం.

**జవాబు:** ప్రస్తుతం అక్కడ ఇల్లు కట్టే ఆలోచనలో లేరు కనుక పుట్ట విషయంలో చింతించడం అనవసరం. మీ స్థలంలోనే పాము పుట్టలుంటే ఆ పరిస్థితులు, సమస్య వేరుగా ఉంటాయి. మీరు గృహ నిర్మాణం చేపట్టినట్టయితే సింహ ద్వారానికి ఎదురుగా, గేటుకెదురుగా పాముపుట్ట రాకుండా ఇల్లు నిర్మించుకోవడం మంచిది.

ప్రస్తుతం ఉన్న గేటుకెదురుగా పుట్ట వున్నట్లయితే గేటును (ఎదురుగా పుట్ట రాకుండా) మరో వైపుకి తప్పించి పెట్టండి. పాముపుట్టలను తొందరపడి తవ్వి తీసేయడం వల్ల అనవసరంగా దోషాలను కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. కాబట్టి అలాంటి పనులు మాత్రం చేయకూడదు.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:

**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు : ..............................................

పుట్టిన తేది : ..............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................

చిరునామా:..................................................

# స్వప్నం నుంచి సాకారానికి

**వికసిత్** భారత్ అనే భావన ఈ కాలపు భారతదేశ ప్రజల ఆశయం మాత్రమే కాదు, అది దేశ భవిష్యత్‌పై ఒక ప్రజ్ఞా సంకల్పం. 2047 నాటికి భారత దేశాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రూపొందిన వికసిత్ భారత్ 2047 శీఘ్ర స్థాయిలో చర్యలు ఈ కలను కార్యరూపంలోకి తీసుకెళ్లే దిశగా పయనిస్తున్నాయి. ఇది కేవలం ఆర్థిక స్థితిగతుల మద్దతుతోనే నడిచే ప్రణాళిక కాదు, ఇది సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలను కల్పిస్తూ, గ్రామీణ ప్రాంతాల నుంచి మహా నగరాల దాకా సమగ్ర పురోగతికి ఆవశ్యకమైన మౌలిక మార్పులపై దృష్టి కేంద్రీకరించిన ఉద్యమం. అభివృద్ధిని కొన్ని శతమాన గణాంకాల్లో కాకుండా సామాన్యుడి జీవనోపాధి మెరుగుపడే మార్గంగా అభివృద్ధి పరచాలన్నదే ఈ ప్రణాళిక అంతర్భావం.



ప్రధానమంత్రి మోడీ ఈ కలను దేశ సమిష్టి సంకల్పంగా మలచే ప్రయత్నం చేస్తున్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే మంత్రాన్ని ఆయన వికసిత్ భారత్‌కు ప్రాథమిక సూత్రంగా ప్రాచుర్యం చేశారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఒక్క పౌరుడు అభివృద్ధి పథంలో భాగస్వామిగా ఉండాలని ఆయన పలుమార్లు పిలుపునిచ్చారు. ఇది కేవలం ప్రభుత్వ ప్రణాళికల అమలు స్థాయిలో నిలవకుండా చిత్తశుద్ధి, ప్రజా చైతన్యంతో కూడిన మార్పును తేవాలన్న నాయకత్వ స్పష్టతకు నిదర్శనం.

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నది. అయితే ఈ వృద్ధి సమానత్వం, స్థిరత్వం, సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలతో సమన్వితంగా సాగకపోతే అది కొన్ని వర్గాలకు మాత్రమే లబ్ధి చేకూర్చే పరిమిత అభివృద్ధిగా మిగిలిపోతుంది. అందుకే వికసిత్ భారత్ భావన మౌలికంగా నాలుగు ప్రధాన పునాదులపై స్థిరంగా నిలబడాలి. ఆర్థిక వ్యూహం, సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి, యువత భాగస్వామ్యం. ఈ నాలుగు మోయలేని స్థంభాలపై ఆధారపడిన ప్రగతే భారత దేశాన్ని 2047 నాటికి వికసిత దేశంగా తీర్చిదిద్దగలదు.

ఆర్థిక రంగంలో పునాది పటిష్టంగా ఉండాలి. జీడీపీ వృద్ధిని నిలకడగా 810 రేటుతో కొనసాగించేందుకు వినియోగం, పెట్టుబడులు, ఎగుమతులు, పౌర సేవల ఆధునీకరణ మొదలైన విభాగాల్లో సమతూకం అవసరం. తయారీ రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించాలన్నదే మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల లక్ష్యం. బహుళ ఉత్పత్తుల ప్రోత్సాహక పథకాలు, బహుళ రంగాల్లో విదేశీ పెట్టుబడుల ప్రవాహం, స్టార్టప్ ఇండియా, ఫిన్టెక్ విప్లవం.. ఇవన్నీ నరేంద్ర మోడీ నాయకత్వంలో ఆర్థిక వ్యవస్థలో కొత్త ఊపును తీసుకు వస్తున్నా, ఈ వృద్ధి ఫలితాలు అన్ని వర్గాలకు చేరాలన్న సమీకరణ సాధించాల్సిందే. వ్యవసాయ రంగంలో ఆధునికత, మార్కెట్ లింకేజ్, సాగు ఆధారిత మౌలిక వసతుల పెంపు తదితర అంశాల్లో మోడీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు రైతులకు గణనీయ ఊతం ఇస్తున్నాయి.

పీఎం కిసాన్ ద్వారా నేరుగా నగదు బదిలీ వ్యవస్థను అమలు చేయడం, తక్కువ వడ్డీ రుణాలు అందుబాటు, స్మార్ట్ అగ్రికల్చర్‌కు డిజిటల్ పథకాల వినియోగం.. ఇవన్నీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేస్తున్నాయి. సామాజిక న్యాయం వికసిత దేశ లక్షణాల్లో ప్రధానమైనదిగా పరిగణించాలి. అభివృద్ధి అనేది అందరికీ, సమానంగా, సమకాలీనంగా చేరాలని కోరుకుంటే, న్యాయబద్ధంగా అనుసంధానించబడిన సంక్షేమ వ్యవస్థ అవసరం. బాలికల విద్యాభివృద్ధి, మహిళా సాధికారత, బహుళ ఆర్థిక వర్గాలకు ఉచిత ఆరోగ్య సౌకర్యాలు, డిజిటల్ సేవల సులభతరం.. వంటి అంశాల్లో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం పలు నూతన కార్యక్రమాలను చేపట్టింది. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్లాది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

నూతన జాతీయ విద్యా విధానం విద్యను బానిసత్వం నుంచి విముక్తి చేసి జ్ఞానానికే అంకితమవుతున్న బలమైన మార్గ సూచిగా నిలుస్తోంది. ఉజ్వల యోజన, బేటీ బచావో, బేటీ పడావో వంటి కార్యక్రమాలు మహిళలను గృహానికి పరిమితం కాకుండా సమాజ నిర్మాణంలో భాగస్వాములుగా తీర్చి దిద్దుతున్నాయి. ఇవి సామాజిక గౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్న మార్పుల సంకేతాలు.

వికసిత్ భారత్‌కు గ్రామీణ భారతమే పునాది. దేశ జనాభాలో సగానికి పైగా గ్రామాల్లో నివసించడంతో పాటు వ్యవసాయ ఆధారిత జీవన విధానాన్ని కొనసాగిస్తున్న తరుణంలో గ్రామాభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి అసాధ్యం.

మోడీ ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతులపై అనేక దశల ప్రణాళికలు అమలు చేస్తోంది. హర ఘర్ జల్, స్వచ్ఛ భారత్, సౌభాగ్య పథకాలు...గ్రామీణ జీవన నాణ్యతను మెరుగు పరచే దిశగా నడుస్తున్నాయి. జూలై 2019లో ప్రారంభించిన హర్ ఘర్ జల్ పథకం లక్ష్యం.. ప్రతి ఇంటికీ నికరమైన తాగునీటి సరఫరా. గ్రామీణ కుటుంబాల్లో ప్రతి ఇంటికి నల్లా ద్వారా శుద్ధ జలాన్ని అందించడం ద్వారా మహిళల శ్రమను తగ్గించడమే కాక, ఆరోగ్య సమస్యల నుండి రక్షణ కలిగించడంలో ఇది కీలకం. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు కోట్లాదికి పైగా ఇళ్లకు జల సరఫరా పూర్తయింది.

గాంధీ 150వ జయంతి (2019)ను పురస్కరించుకొని 2014లో ప్రారంభమైన స్వచ్ఛ భారత్ ఉద్యమం భారతదేశంలో ఓ సామూహిక మార్పుకు నాంది పలికింది. దేశవ్యాప్తంగా టాయిలెట్లు నిర్మాణం, కచ్చితమైన చెత్తపరిహారం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో శుభ్రతపై అవగాహన ద్వారా మానవ గౌరవాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించిన ఉద్యమంగా ఇది నిలిచింది. మోడీ ఈ ఉద్యమాన్ని వ్యక్తిగత ఆచరణగా తీసుకొని దేశ ప్రజలకూ ప్రేరణగా నిలిచారు.

అక్టోబరు 2017లో ప్రారంభించిన సౌభాగ్య యోజన పథకం లక్ష్యం.. దేశంలోని ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం. 2018లోనే లక్ష్యాన్ని అధిగమించి 2.6 కోట్ల పేద కుటుంబాలకు విద్యుత్‌ను అందించారు. ఈ పథకం ద్వారా విద్య, ఉపాధి, ఇంటి ఉత్పాదకత పెరిగింది. వికసిత్ భారత్‌లో దీప్తిమంతమైన ప్రగతికి ఇది మార్గదర్శిగా నిలిచింది.



పల్లెల్లో మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యుద్దీకరణ, హై స్పీడ్ ఇంటర్నెట్ వంటి అంశాల్లో జరిగిన పురోగతికి గణాంకాలు చాటుదలే. కానీ ఈ పురోగతి ప్రజల జీవన ప్రమాణాలను నిజంగా ఎత్తుకు తీసుకెళ్తున్నదా? అన్న ప్రశ్నపై సమీక్ష అవసరం.

వికసిత భారత్‌లో యువత పాత్ర అనితర సాధ్యం. భారతదేశం యువ శక్తితో నిండి ఉంది. కానీ ఈ యువ శక్తి నిరుద్యోగంలో నలిగితే, అభివృద్ధి లక్ష్యాలన్నీ గాలి కోటలుగా మారే ప్రమాదం ఉంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి మోడీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. డిజిటల్ లిటరసీ కార్యక్రమాల ద్వారా వృత్తి శిక్షణ పెరుగుతోంది. స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి పథకాల ద్వారా యువతకు పరిశోధనా, ఆవిష్కరణా అవకాశాలు అందుతున్నాయి. యువత జాతీయ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య ప్రచారాలు, గ్రామీణ విద్య అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని పిలుపునిస్తూ ప్రధానమంత్రి మోడీ యువతలో సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నారు.

ఇవన్నీ కలిసినప్పుడు మాత్రమే అభివృద్ధి సమగ్రంగా, సమన్యాయంగా, సమతుల్యంగా జరుగుతుంది. అభివృద్ధి అంటే బహుళ అంతస్తుల భవనాలు, విమానాశ్రయాలు, మెట్రో రైళ్లు మాత్రమే కాదు. అది గ్రామాల్లో భద్రమైన తాగునీటి బోర్లతో కూడిన ఇంటి ప్రాంగణాలు, పాఠశాలల్లో నాణ్యమైన ఉపాధ్యాయులు, దవాఖానల్లో యంత్ర పరికరాలు, వ్యవసాయానికి సకాలంలో రుణం, ధరకు మద్దతు, వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి మార్కెట్ ఇలాంటివే నిజమైన అభివృద్ధికి గుర్తింపులు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్పంతో దేశ వ్యాప్తంగా జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రజల అభిప్రాయాలను, ఆశయాలను, అభివృద్ధి ప్రాధాన్యతలను సేకరించే విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమంగా మారింది. ఇది అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్న స్పష్టమైన సంకేతం. పాలకులు నిర్ణయాల స్వరూపాన్ని ప్రజల నుంచి పొందిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మలచాల్సిన అవసరం ఉంది. ప్రజలు కేవలం ఓటర్లు కాదు, అభివృద్ధి భాగస్వాములు అన్న బలమైన సందేశం ఇది. వికసిత్ భారత్ అనేది గాలిలో ఊగే పదజాలం కాకుండా, భారతదేశ భవిష్యత్‌కు రూపాన్ని ఇస్తున్న శాశ్వత సంకల్పంగా మారుతోంది. ఇది ఓ వ్యక్తిగత లక్ష్యం కాదు, సామూహిక కార్యాచరణ. అభివృద్ధి పథాన్ని ప్రభుత్వం మాత్రమే నిర్మించదు.. ప్రజలతో కలిసి నిర్మిస్తుంది. అందుకే వికసిత్ భారత్ ఒక కల కాదు అది బాధ్యతగా, దిశగా, ధ్యేయంగా ప్రజల హృదయాల్లో మిగలాలి. అప్పుడే 2047 నాటికి భారత్ విశ్వంలో వికసిత దేశంగా తలెత్తి నిలవగలదు.

**- రామకిష్టయ్య సంగనభట్ల**


## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

# తరాలు మారినా తరగని రుచి..

భారతీయ ఆహార సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం పాలకోవా. ఇది శతాబ్దాలుగా అందరికీ పరిచయమున్న రుచికరమైన ఆహార పదార్థం. పిల్లలు, పెద్దలు అనే వయోభేదం లేకుండా అందరినీ ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఇది సంప్రదాయ మిఠాయి, మృదువైన ఆకృతిని కలిగి ఎంతో రుచిగా ఉండే  పాలకోవాని అందరూ చాలా మక్కువగా తింటారు. స్వీట్ షాప్స్‌లోనే కాకుండా చిన్న చిన్న దుకాణాలలో సైతం పాలకోవా దొరకడం విశేషం. కొన్ని ప్రాంతాలలో దీన్ని ఖోవా, మావా ఇత్యాది పేర్లతో పిలుస్తారు. పాలకోవాకు వందల సంవత్సరాల చరిత్ర ఉంది.

## పాలకోవా చరిత్ర

పాలకోవా చరిత్ర చాలా ప్రాచీనమైనది. కవి సామ్రాట్ శ్రీనాథుడు కూడా పాలకోవా గురించి తన రచనలలో ఎంతో ఇష్టంగా వర్ణించినట్లు చెబుతారు. పాలకోవా భారత ఉపఖండంలో ఉద్భవించిన తీపి వంటకం. ఇది తరతరాలుగా ప్రజల ఆదరణ పొందింది. పాలకోవా ప్రధానంగా పాలను గట్టిపడే వరకు మరిగించి, చక్కెర కలిపి తయారు చేస్తారు. ఇది పాలను చిక్కగా మరిగించడం ద్వారా లభించే పాల ఘన పదార్థం, పండుగలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాలలో దీనిని తయారు చేస్తారు. దీన్ని ఐక్యత, ఆనందానికి ప్రతీకగా భావిస్తారు. దేవతలకు ప్రసాదంగా కూడా దీనిని సమర్పిస్తారు. ఉత్తర భారతదేశంలో దీనిని సాధారణంగా 'దూద్ పెడా', 'ఖోయా పెడా' అని పిలుస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని మధురతో పాటు దాని సమీపాన ఉన్న బ్రజ్ ప్రాంతం భారతదేశంలో పాలకోవాకు చాలా ప్రసిద్ధి. ఈ ప్రాంత పాలకోవాకు 160 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది.

## ప్రసిద్ధి చెందిన మధుర పాలకోవా

ఉత్తరాదిన కొన్ని ప్రాంతాలలో పాలకోవాను పెడా అంటారు. పాలకోవా తయారీలో 160 యేళ్ల చరిత్ర ఉన్న షాప్ మధుర సమీపంలోని బ్రజ్‌లో ఉంది. బ్రిటన్ రాణి విక్టోరియా ఇష్టపడిన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మధుర పేడా గురించి తెలిస్తే ఆశ్చర్యం కలగక మానదు. భారతదేశం నుంచి బ్రిటిషువారు తమ దేశానికి అనేక వస్తువులను, సంపదను తరలించుకుని వెళ్ళిపోయారు. వాటిలో తినదగిన వస్తువు 'మధుర పెడా' అంటే పాలకోవా అన్నమాట. ఇక్కడ తయారయ్యే పాలకోవా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. పాలకోవ తయారీ ఉత్తరప్రదేశ్‌లో మధురలోనే మొదలైందని ఇక్కడి వారు చెబుతుంటారు. 160 సంవత్సరాల చరిత్ర కలిగిన పాలకోవా తయారీ దుకాణం బ్రజ్ ప్రాంతంలో ఉంది. ఈ దుకాణంలో తయారు అయ్యే పాలకోవాను ఇష్టపడేవారి సంఖ్య అత్యధికంగా ఉంటుంది. ఇక్కడ తయారు చేసిన పాలకోవా ఒకప్పుడు బ్రిటిష్ రాజ కుటుంబానికి చెందిన డైనింగ్ టేబుల్ మీద ఉండేది. బ్రిటన్ రాణి విక్టోరియా మధుర పాలకోవాను ఎంతగానో ఇష్టపడేవారని తెలుస్తోంది.

ఈ పాలకోవా తయారీ దుకాణం బ్రజ్ ప్రాంతంలో ఉంది. వర్తకం కోసం మన దేశానికి వచ్చిన బ్రిటిషువారు మన దేశాన్ని సుమారు రెండు వందల సంవత్సరాలకు పైగా పరిపాలించారు. ఈ కాలంలో వారి స్వలాభం కోసం మన దేశంలో రైల్వేలు, పోస్టల్ వ్యవస్థ వంటి అనేక వ్యవస్థలను ఏర్పాటు చేశారు.

## పలు ప్రాంతాలలో పాలకోవా

భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో పాలకోవాను వేర్వేరు పేర్లతో పిలుస్తూ, కొద్దిపాటి మార్పులతో దీన్ని తయారు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడులో కూడా దీనికి మంచి డిమాండ్ ఉంది. మన రాష్ట్రానికి చేరువగా ఉన్న తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూర్ పాలకోవా చాలా ప్రాచుర్యం పొందింది. 1920ల ప్రారంభంలో దేవసింగ్ అనే వ్యక్తి దీనిని మొదటిసారిగా తయారు చేశారని చెబుతారు. ఇక్కడి పాల నాణ్యత, అధిక లభ్యత వల్ల ఈ పాలకోవాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. 1970లలో వచ్చిన శ్వేత విప్లవం (పాల ఉత్పత్తి పెరుగుదల) శ్రీవిల్లిపుత్తూర్ పాలకోవా వృద్ధికి దోహదపడిందని నమ్ముతారు. తమిళనాడులో దీనిని 'థెరాటిపాల్' అని కూడా పిలుస్తారు. కర్ణాటక రాష్ట్రం కూడా పాలకోవా చాలా ప్రసిద్ధి చెందింది. ఇలా ప్రతి ఊరి పాలకోవా దేనికదే ప్రత్యేకమైన రుచిని కలిగి ఉండటం విశేషం.



ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే పాలకోవా రుచే వేరు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి పాలకోవా చాలా ప్రసిద్ధి చెందింది. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమండ్రిలో పాలకోవా పుట్టిందని కొందరి నమ్మకం. ఇక్కడ తయారు చేసే పాలకోవా ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. తూర్పు గోదావరి జిల్లా కోనసీమకు చెందిన కొత్తపేట ప్రాంతంలో ఖండ్రిగ గ్రామంలో తయారయ్యే పాలకోవా కూడా చాలా ప్రసిద్ధి. ఈ ప్రాంతాలన్నిటిలోనూ పాలకోవాను స్వచ్ఛమైన పాలతో, ప్రత్యేకమైన పద్ధతుల్లో తయారు చేసి, ఇక్కడివారు తమకంటూ ఒక ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం దర్గా సెంటర్లో లభించే పాలకోవా కూడా ఎంతో రుచికరంగా ఉంటుంది. ఇక్కడ నలభై సంవత్సరాలకు పైగా కోవా తయారీ జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని మందస గ్రామంలో తయారుచేసే పాలకోవ 'మందస ఔషధ పాలకోవ'గా ప్రసిద్ధి చెందింది.

తూర్పు కనుమలలోని ఔషధ గుణాలు కలిగిన మొక్కలను తినే పశువుల పాలతో దీన్ని తయారు చేస్తారు. దీనికి దాదాపు 300 సంవత్సరాల చరిత్ర ఉందని ఇక్కడివారు చెబుతున్నారు. దీనికి ప్రత్యేకమైన ద్రవరూప తీపి రుచి ఉంటుంది. ఇక్కడ పాలకోవను కట్టెల పొయ్యిపై తయారు చేయడం వల్ల దానికి ప్రత్యేకమైన రుచి వస్తుందని చెబుతారు. శ్రీకాళహస్తి పాల సహకార సంఘం తయారు చేసే పాలకోవ చాలా సంవత్సరాలుగా ప్రాచుర్యం పొందింది.

కర్నూలు జిల్లాలోని తడకనపల్లె పాలకోవా కూడా వంద యేళ్ల చరిత్ర కలిగి ఉంది. ఇది ప్రత్యేకమైన రుచి, నాణ్యతకు పేరు గాంచింది. ఈ గ్రామంలోని ఎక్కువ కుటుంబాలకు పాలకోవా తయారీ జీవనాధారం అని చెప్పవచ్చు. తడకనపల్లి పాలకోవ స్వచ్ఛత, ప్రత్యేకమైన రుచికి ప్రసిద్ధి చెందింది. ఇక్కడి పశువులకు సేంద్రీయంగా పండించిన గడ్డిని ఆహారంగా అందిస్తారు. ఇది పాల నాణ్యతను పెంచుతుందని నమ్ముతారు. కోవా తయారీలో కూడా పదార్థాల పోషక విలువలను కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. తడకనపల్లి, కోవాకు ఇతర రాష్ట్రాల నుండి కూడా ఆర్డర్లు వస్తుంటాయి. గ్రామంలోని ప్రధాన రహదారి వెంబడి పాలకోవను విక్రయించే ప్రత్యేక స్టాల్స్ ఎక్కువగా కనిపిస్తాయి.



శ్రీకాళహస్తి పాలకోవా కూడా చాలా ప్రసిద్ధి చెందింది. పాలకోవాను కొందరు ఎర్రగా, మరికొందరు తెల్లగా, ఇంకొందరు తీపి ఎక్కువగా, కొందరు పొరలుగా, మరికొందరు వెన్నలా దీన్ని తయారు చేస్తారు. తిరుపతి సమీపాన నెలకొని వున్న శ్రీకాళహస్తి పాలకోవా కూడా చాలా ప్రసిద్ధి. ఇక్కడ తయారుచేసే పాలకోవాకు సుమారు ఐదు దశాబ్దాల చరిత్ర ఉంది. స్వచ్ఛమైన పాలను ఉపయోగించి, కట్టెల పొయ్యిపై తయారు చేయడం వల్ల దీనికి ప్రత్యేక రుచి వస్తుంది. కడప జిల్లాలోని గువ్వల చెరువు గ్రామ పాలకోవాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గువ్వల చెరువు పాలకోవా నోట్లో వేసుకోగానే కరిగిపోయేంత మృదువుగా ఉంటుంది. గువ్వల చెరువు పాలకోవా 150 సంవత్సరాలకు పైగా ప్రసిద్ధి చెందింది.

తెలంగాణాలో పాలకోవాకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం నిజామాబాద్ జిల్లా సిర్నాపల్లి. ఈ గ్రామం పాలకోవా ప్రత్యేక రుచిని కలిగి నాణ్యతకు మరో పేరులా విరాజిల్లుతోంది. సిర్నాపల్లి గ్రామంలో చాలా కుటుంబాలు పాలకోవా తయారీపై ఆధారపడి జీవిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, పల్నాడు. తిరుపతి వంటి ప్రాంతాల్లో పాలకోవా స్థానిక వంటకంగా ప్రసిద్ధి చెందింది. పల్నాడు పాలకోవా రుచికి, నాణ్యతకు పేరొందింది. కొత్తపేట మండలం వాడపాలెం భగవాన్ పాలకోవా అందరినీ విశేషంగా ఆకర్షిస్తుంది. స్వచ్ఛమైన పాలతో తయారు చేసే వాడపాలెం భగవాన్ పాలకోవా అందరినీ విశేషంగా ఆకర్షిస్తుంది.

భీమవరం సమీపంలో మార్టేరు కాశి పాలకోవా విశేష రుచిని కలిగి ఉంటుంది. మార్టేరులోని కాశిగారి కోవా హౌస్ సంప్రదాయ పద్ధతిలో తయారుచేసే పాలకోవాకు పేరుగాంచింది.

## తయారు చేసే విధానం

పాలకోవా తయారీకి చాలా ఓపిక అవసరం. పాలు కుంపటి మీద పెట్టి మీగడ కట్టకుండా, గరిట కింద పెట్టకుండా తిప్పుతుండాలి. రెండు గంటల అనంతరం పాలు ముద్దలా అవుతుంది. ఇంకా తిప్పుతూనే ఉండాలి. మరికొంతసేపటికి గట్టిగా ముద్దలాగ అవుతుంది. చక్కెర మెల్లమెల్లగా పోసి మళ్ళీ తిప్పుతుండాలి. పల్చని పాకం తయారవుతుంది. మరికొంతసేపటికి పంచదార పాకం అయి పల్చబడిన కోవా మళ్ళీ గట్టిగా అవుతుంది. ఒక పళ్లానికి నెయ్యి రాసుకొని కోవా ముద్దను పళ్ళెంలో గుమ్మరించాలి. శుభ్రంగా కడిగిన గుండ్రాయిగాని, పచ్చడిబండగాని, కంచు చెంబుగాని తీసుకొని, నెయ్యి రాసి కోవా ముద్దని కాటుక నూరినట్టు ఒక ఐదు నిమిషాలు బలంకొద్దీ నూరాలి. ఇందువల్ల కోవా ఉండలు ఉండలుగా కాక, చక్కగా మెత్తగా అవుతుంది. తదనంతరం దానిని కావలసిన ఆకారాల్లోకి మార్చుకుంటారు. కొన్ని సందర్భాల్లో దీనికి ఏలకులు, ఇతర సుగంధ ద్రవ్యాలు జోడిస్తారు. ఈ మిశ్రమాన్ని గట్టిగా అయ్యేవరకు కలియబెడతారు. ఆపై దానిని బిళ్లలుగానే కాక కావలసిన ఆకారాల్లో మలచుకుంటారు. కొంతమంది శ్వేత వర్ణంలో పాలకోవాని తయారు చేస్తే, మరికొంతమంది పలురకాల రంగులను కలిపి ఆకర్షణీయంగా తయారు చేస్తారు.

పాలకోవా సాధారణంగా దీపావళి, ఉగాది, సంక్రాంతి వంటి పండుగలలో, వివాహాలు, ఇతర శుభకార్యాలలో భాగంగా ఎక్కువగా తయారు చేస్తుంటారు. పాలకోవాను నైవేద్యంగా కూడా ఉపయోగిస్తారు. పాలకోవాను సరళమైన పద్ధతిలో తయారు చేయవచ్చు కనుక గ్రామీణ గృహాల్లో కూడా సులభంగా తయారు చేయడానికి వీలు కల్పించింది.

కొన్ని ప్రాంతాల్లో పాలకోవాను నెయ్యితో కలిపి, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించి తయారు చేస్తారు. 20వ శతాబ్దంలో శ్వేత విప్లవం భారతదేశంలో పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచింది. ఈ కార్యక్రమం ద్వారా పాలకోవా లాంటి స్వీట్ల తయారీ వాణిజ్య స్థాయిలో జరిగింది. దీనివల్ల పాలకోవా దేశవ్యాప్తంగానే కాక విదేశాల్లో సైతం ప్రజాదరణ పొందింది.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

ఆదివారం వార్త

10 ఆగస్టు, 2025

## మంచి ముత్యాలు

మానవత్వం విజయం పొందాలంటే, సాత్వికశక్తి అవసరం.
–బాబాసాహెబ్

నాలుక మనం చెప్పినట్లు వినకపోవడమే అన్ని అనర్థాలకు మూలం.
–సెనెకా

## కదంబం

'సంఘీ'భావం....5
సంక్షోభంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

కవర్ స్టోరీ..6
'స్థానిక' పాలనే గ్రామ స్వరాజ్యం

ఈ వారం కవిత్వం...12
కొత్త బంగారు లోకం

కథ..20
గడ్డాలనాటి బిడ్డలు

సాహిత్యం.. 23
ఊయల ఊసులోనే తెలుగు సొగసు

స్వప్నం నుంచి ....... 26

ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా.. వగైరా..

# సమాచారం

## వ్యక్తిత్వాన్ని బట్టే వ్యాయామం!

ఈ రోజుల్లో వైద్యం ఎవరికి తగ్గట్టు వాళ్లకి కస్టమైజ్ అవుతోంది. అలాంటప్పుడు వ్యాయామం ఎందుకలా కాకూడదని ప్రశ్నిస్తున్నారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా–లాస్ ఏంజెలెస్‌కి చెందిన శాస్త్రవేత్తలు. మన మనస్తత్వానికి తగ్గ వ్యాయామాన్ని ఎంచుకుంటేనే దాన్ని జీవితాంతం కొనసాగిస్తామనీ ప్రతిసారీ ఆనందిస్తామనీ చెబుతున్నారు. ఈ శాస్త్రవేత్తలు వివిధ దేశాలకి చెందిన సుమారు 1500 మంది నడి వయస్కుల వ్యాయామాల తీరుతెన్నుల్ని పరిశీలించారు. దాన్ని బట్టి నిత్యం చురుగ్గా దూకుడుగా ఉండేవాళ్లు, తమలో తాము ముడుచుకుపోయేవాళ్లు, ఆ రెండూ కాకుండా మధ్యస్థంగా ఉన్నవాళ్లు.. అని మనుషుల్ని వర్గీకరించారు. దూకుడెక్కువగా



ఉన్నవాళ్లకు పరుగు, బరువులెత్తడం లాంటి తీవ్ర వ్యాయామాలు మంచిదంటున్నారు. అంతర్ముఖులకి.. జాగింగ్, నడక లాంటి తక్కువ తీవ్రత ఉన్నవి చాలంటున్నారు. బరువులెత్తడం వీళ్లకి మేలు చేసినా అవి జిమ్‌లలో అందరితో కలిసి కాకుండా ఒంటరిగా చేయడమే మేలంటున్నారు. ఇక మధ్యస్థంగా ఉన్నవాళ్లు.. ఎప్పుడూ ఏదో ఒకటి రెండు రకాలతో పరిమితం కాకుండా అన్నింటినీ కలగాపులగంగా ఎంచుకుంటే ఎక్కువ కాలం కొనసాగించగలుగుతారని సూచిస్తున్నారు. మీకు ఏ వ్యాయామం సరిపోతుందో చూడండి మరి.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# 10 ఆగస్టు, 2025 నుండి 16 ఆగస్టు, 2025 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం చిన్న చిన్న వ్యాపారాలు తాత్కాలిక వ్యాపారాలు మొదలు పెట్టాలన్న ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చిన్ననాటి స్నేహితులతో కలిసి విహారయాత్రలు చేయాలన్న ఆలోచనలు ముడిబడతాయి. దూరప్రాంత ప్రయాణాలు చేస్తారు. కళా సాహిత్యకారులకు కాలం అనుకూలంగా ఉంటుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి.

### వృషభం

ఈ వారం ట్రావెల్స్ వ్యాపారస్తులకు కాలం అనుకూలంగా ఉంటుంది. నూతన గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. ప్రింట్ మీడియాలో ఉన్న వారికి కాలం కలిసి వస్తుంది. కళాకారులకు రచయితలకు మీరు రాసినవి ప్రచురించబడతాయి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అర్చన జరిపించండి. క్రీడారంగంలో ఉన్నవారికి అనుకూలంగా ఉంటుంది.

### మిథునం

ఈ వారం కొత్త వస్తువులను తాత్కాలికంగా ప్రవేశపెట్టి క్రయవిక్రయాలు జరిపించగలిగితే అన్ని విధాలుగా లాభాలను అందుకో గలుగుతాము అన్న ఆలోచనలు ముడి పడతాయి. కొత్త ఉద్యోగస్తులకు కాలం అనుకూలంగా ఉంది. మీ వ్యాపార సంస్థలో కొత్తవారిని చేర్చుకుంటారు. కౌముది రూపుని మెడలో ధరించండి.

### కర్కాటకం

ఈ వారం ఈ వారం వైద్య విద్య పట్ల మక్కువ చూపిస్తారు. అనుకోని ఖర్చులు ఏర్పడతాయి. బంధువుల ద్వారా ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు బాగుంటాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది.

### సింహం

ఈ వారం రాజకీయాల పట్ల ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని మీరు ఆకర్షితులు అవుతారు. ప్రజా సంబంధం బాంధవ్యాలు కూడుకున్నటువంటి ఉద్యోగస్తులకు వ్యాపారస్తులకు అనుకూలమైన మార్పులు ఏర్పడతాయి. పూజల్లో నాగ సింధూరం కుంకుమను ఉపయోగించండి. మీరు అనుకున్నది సకాలంలో మీ చేతికి అందుతుంది.

### కన్య

ఈ వారం ఉద్యోగరీత్యా కాలం అనుకూలంగా ఉంటుంది. మీరు పడిన కష్టానికి మంచి ప్రతిఫలాన్ని అందుకుంటారు. సంతానం పట్ల బాధ్యత కలిగి ఉంటారు. వారి జీవితంలో వస్తున్న మార్పులను స్పష్టంగా గ్రహించి, గమనించి మీరు తీసుకోవలసిన జాగ్రత్తలు సమయానికి తీసుకోగలుగుతారు. శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి.

### తుల

ఈ వారం దూర ప్రాంతంలో ఉన్న వారితో చర్చలు మాటలు సాగిస్తారు. కొన్ని పనులు ఘనంగా పూర్తి చేయగలుగుతారు. నూతన వ్యాపారాలు ప్రారంభించాలన్న ఆలోచనలు బాగుంటాయి. పోలీస్ శాఖలులో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ఎంత కాలంగానో ఎదురుచూస్తున్న ఒక శుభ ఆహ్వానాన్ని అందుకోగలుగుతారు.

### వృశ్చికం

ఈ వారం అయిన వాళ్లతో ఏర్పడిన గొడవలు మాట పట్టింపులకు పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తారు. కొంతమంది మధ్యవర్తుల ద్వారా చర్చలు కొనసాగిస్తారు. దూర ప్రయాణాలు అనుకూలిస్తాయి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి త్రిశూల్ పొడితో ధూపం వేయండి. నర దిష్టి తొలగిపోతుంది. కుటుంబపరమైన బరువు బాధ్యతలను సక్రమంగా నిర్వహించి గలుగుతారు.

### ధనస్సు

ఈ వారం దీర్ఘకాలిక ఆశయాలను నెరవేర్చుకోవడానికి కీలక స్థానాల్లో ఉన్న వ్యక్తులతో సంభాషణలు సాగిస్తారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది. శత్రువర్గం బలహీనతలు తెలుసుకొని నేర్పుగా వ్యవహరిస్తారు. శివాలయాల్లో సెనగలు ఇవ్వండి. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. కుటుంబ వాతావరణం ఉత్సాహ పూరితంగా ఉంటుంది. ఉన్నత స్థాయి వ్యక్తులతో స్నేహాలు

### మకరం

ఈ వారం ధాన్యం వ్యాపారస్తులకు లాభాలు బాగుంటాయి. పరిస్థితుల రీత్యా రేటు పెంచి అమ్ము కుంటారు. పోటీ పరీక్షలు, ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. సివిల్ కాంట్రాక్టర్ లకు బాగుంటుంది. లీజ్, లైసెన్సులు లభిస్తాయి.శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరం తో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి. ప్రజల ఆదరణ అభిమానం కోసం ఎంత కష్టమైన పడతారు.


### కుంభం

ఈ వారం బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు. నిత్యం దీపారాధన కుందిలో రెండు చుక్కలు వేయటం వలన అన్ని విధాలా మంచిది. రుణాలు తీరుతాయి. పిల్లలు అభివృద్ధిలోకి వస్తారు. కోర్టు కేసుల నుండి విముక్తి పొందుతారు. ప్రముఖుల నుండి వచ్చిన వార్త వలన కొంత సంతోషం కలుగుతుంది. ముఖ్యమైన పనులు సాఫీగా సాగుతాయి.

### మీనం

ఈ వారం విహారయాత్రలు, దైవదర్శనాలు చేసుకోగలుగుతారు. ఇంటికి దూరంగా ఉండి చదవవలసిన పరిస్థితులు, అవకాశాలు ఏర్పడతాయి. సకాలంలో ఇది సద్వినియోగం చేసుకోండి. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. భూ సంబంధమైన విషయ వ్యవహారాలు ముడిబడతాయి.

# ఈ వారం 'కార్టూన్స్'



మరణం తర్వాత కూడా
వాట్సప్, ఫేస్ బుక్కు, యూట్యూబు
చూడాలనుకుంటున్నారా?
నేడే నేత్రదానం చేయండి!!
EYE BANK


ఈ వర్క్ ఫ్రం హోం బోరుగా ఉందండీ.. బస్టాండ్, రైల్వే స్టేషన్ లాంటి జనాలుండే ప్లేస్‌లో పనిచేయాలని ఉంది!!
సాఫ్ట్‌వేర్.


మన పెద్దలు ఒప్పుకున్నారు.. కానీ 'ట్రంప్' ఒప్పుకుంటాడో లేదో.. భయంగా ఉంది!!



కొలంబియా
తీరంలో ఉన్న ఈ దీవిని శాంటాక్రజ్ డెల్ ఐలోట్ అని పిలుస్తారు. ఫుట్ బాల్ గ్రౌండ్ విస్తీర్ణంలో వుండే ఈ దీవిలో మత్స్యకారులు మాత్రమే నివసిస్తారు.  ఈ దీవిని సందర్శించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.















# ఏడు వారాలు నగలు









**బంగారం** అంటే ఇష్టపడనివారు చాలా అరుదు. ఎన్ని ఆధునిక మార్పులు వచ్చినా బంగారానికి ఏమాత్రం ఆదరణ తగ్గడం లేదు. అందుకేనేమో బంగారం ధర రోజు రోజుకూ పెరుగుతోందే కానీ తగ్గడం లేదు. ఒకప్పుడు శ్రీమంతుల దగ్గర ఏడు వారాల నగలు ఉండేవి. ఏడు వారాల నగలున్నాయంటే వాళ్లెంతో గొప్పవాళ్లన్నమాట. వివాహ సమయంలో పెళ్లికూతురుకి ఏడు వారాల నగలు పెట్టే సంప్రదాయం పాటించేవారు కొందరు.

**ఏడు వారాల నగలంటే?** ఒక్కో వారానికి ఒక్కో గ్రహం అధిపతిగా ఉంటుంది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఆ గ్రహం అనుకూలంగా వుండడం కోసం ఒక్కో విధమైన రత్నం/ ఆయా రత్నాలు నగలు ధరిస్తారు.

ఆదివారం: ఆదివారం సూర్య గ్రహానికి సంబంధించినది. ఆదివారంనాడు కెంపులతో చేసిన ఆభరణాలు ధరిస్తే అనారోగ్య సమస్యలు తీరి ఆయురారోగ్యం లభిస్తుంది.

సోమవారం: సోమవారానికి చంద్రుడు అధిపతి. ఈ రోజు ముత్యాలతో చేసిన ఆభరణాలు ధరించడం వల్ల మానసిక సమస్యలు దూరమై మనసు నిర్మలంగా ఉంటుందని విశ్వాసం.

మంగళవారం: మంగళవారానికి అధిపతి కుజుడు. పగడాలతో చేసిన ఆభరణాలు ధరించాలని శాస్త్ర వచనం. పగడాల నగలను ధరించడం వల్ల వైవాహిక జీవితంలో సమస్యలు ఉంటే తొలగిపోతాయి. సంతానం కోరుకునే వారికి సంతాన ప్రాప్తి లభిస్తుంది.

బుధవారం: బుధుడు బుధవారానికి అధిపతి. పచ్చలతో చేసిన ఆభరణాలు ధరించడం మంచిది. ఈ ఆభరణాలు ధరించడం వల్ల వృత్తి, వ్యాపారాల్లో విజయం లభిస్తుంది. విద్యార్థులకు తెలివితేటలు పెరుగుతాయి.

గురువారం: గురువారానికి బృహస్పతి అధిపతి. పుష్యరాగంతో చేసిన ఆభరణాలు ధరించాలి. పుష్యరాగాలతో చేసిన ఆభరణాలు ధరించడం వల్ల గురుగ్రహం అనుకూలించి ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యం, ఉన్నత పదవులు లభిస్తాయి.

శుక్రవారం: శుక్రవారానికి అధిపతి శుక్ర గ్రహం. శుక్రవారంనాడు వజ్రాభరణాలు ధరించడం శుభప్రదం. శుక్రుని అనుగ్రహం వలన మంచి జీవితం లభిస్తుంది.

శనివారం: శనివారానికి అధిపతి శని భగవానుడు. శనివారం రోజున నీలమణులు పొదిగిన నగలు ధరించాలని శాస్త్ర వచనం. ఈరోజు నీలమణులు ధరించడం శని గ్రహం అనుకూలతతో పనుల్లో ఆటంకాలు తొలగిపోతాయి. అపమృత్యు దోషాలు తొలగిపోతాయి.







## 'సంఘీ' భావం



# సంక్షోభంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

ఒకప్పుడు యువతకు కల్పతరువుగా ఉన్న సాఫ్ట్‌వేర్ రంగం ఇప్పుడు ప్రతికూలంగా మారింది. ప్రముఖ సంస్థల్లో ఉద్యోగులను పెద్ద సంఖ్యలో తొలగిస్తున్నారు. లాభాల బాటలో ఉన్న సంస్థలు సైతం ఇష్టారాజ్యంగా యువతను ఇళ్లకు పంపించివేస్తున్నారు. సిబ్బంది సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవడం ద్వారా మిగిలిన సిబ్బందిపై పనివత్తిడి పెంచి మరిన్ని లాభాలు ఆర్జించాలన్న లక్ష్యంగా కొన్ని ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. దీనికి అనుగుణంగానే ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి ఒక ప్రకటన చేస్తూ ఉద్యోగులు రోజుకు కనీసం పది నుంచి పన్నెండు గంటలు పనిచేయాలని చెప్పారు. ఎల్ అండ్ టి అధినేత సుబ్రహ్మణ్యన్ మరో అడుగు ముందుకు వేసి సెలవు దినాల్లో ఇళ్లలో భార్యల ముఖాలు చూస్తూ కాలయాపన చేయడం సరికాదని అన్నారు. ప్రముఖ దిగ్గజ కంపెనీల అధినేతలు, సిఇవోలు ఈ విధమైన ప్రకటనలు చేయడం వల్ల ఆయా రంగాల్లో మిగిలిన సంస్థలు వీరిని ఉదహరిస్తూ పనిగంటలు పెంచడం, జీతాలు తగ్గించడం, సెలవులను మంజూరు చేయకపోవడం వంటివి చేస్తున్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు చేసిన ప్రకటన సాఫ్ట్‌వేర్ రంగంలో ఆందోళనలను కలిగిస్తోంది. ఇదే పరిస్థితి ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రో వంటి సంస్థలలో కూడా నెలకొంది. మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు సుమారు 15 వేల మంది ఉద్యోగాలు తొలగించి ఇళ్లకు పంపించింది. మరికొంత మందిపై కూడా చర్యలు తీసుకోవడానికి సిద్ధపడుతోంది. గూగుల్. అమెజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే వైఖరితో ఉండటం విశేషం. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. కేవలం ఒక్క ఏఐ వల్ల రాబోయే సంవత్సర కాలంలో వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో కనీసం లక్షమంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఐటి నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉద్యోగాలు తొలగిస్తున్న సంస్థలు ఏవీ కూడా నష్టాల బాటలో లేవు. దాదాపుగా అన్ని సంస్థలు ప్రతి సంవత్సరం కనీసం 5 నుంచి 15 శాతం వరకు అధిక లాభాలను గడిస్తున్నాయి. 40-45 సంవత్సరాల వయస్సులో ఉన్నవారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే వారికి మళ్లీ ఉద్యోగం లభించడం సమస్యగా మారుతుంది. కేవలం లాభాలు గడించేందుకు మాత్రమే ఉద్యోగుల తొలగింపు, ఎక్కువ పనిగంటలు అన్న విధానాలను సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమలు చేస్తున్నాయి. ఇప్పటికే వర్క్ ఫ్రం హోం పేరుతో పనివేళలు ఇష్టారాజ్యంగా అమలు చేస్తున్నారు. ముఖ్యంగా క్లయింట్ల సమావేశాలు ఉన్నాయని చెబుతూ ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి పదకొండు గంటల వరకు ల్యాప్‌టాప్‌లపై పనిచేస్తూ గడిపే దుర్భర పరిస్థితులను కల్పిస్తున్నారు. ఒకప్పుడు జల్సాగా, ఆనందంగా కనిపించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రస్తుతం ఆందోళనలతో, పనిభారంతో సతమతం అవుతూ కనిపిస్తున్నారు. పరిశ్రమల్లోను, దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులకు కనీస హక్కులు కల్పిస్తున్న ప్రభుత్వాలు సాఫ్ట్‌వేర్ సంస్థలపై పట్టును సాధించేందుకు వెనుకడుగు వేస్తున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటుకు వందల ఎకరాలు సంస్థ అతి తక్కువ ధరకు కట్టబెడుతున్నాయి. సంస్థల కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి అనేక రాయితీలు కల్పిస్తున్నాయి. అయితే అందులో పనిచేసే ఉద్యోగుల సంక్షేమాన్ని, భద్రతను మాత్రం గాలికి వదిలివేశాయి. లాభాల్లో నడుస్తున్న సంస్థల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. వాస్తవానికి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరుకున్నాయి. దీనితో వాటి జోలికి వెళ్లేందుకు ప్రభుత్వాలు సాహసించడం లేదు. లేబర్ చట్టాలు, కోర్టులు ఉన్నప్పటికీ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగుల విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదు. ఇంజనీరింగ్, ఎంబిఏలతో పాటు ఇతర ఉన్నత విద్యను అభ్యసించిన వారిని క్యాంపస్ ఇంటర్వ్యూల పేరుతో అతి తక్కువ వేతనానికి ఉద్యోగాల్లో తీసుకుని, మూడు నాలుగేళ్ల తరువాత వేతనాలు పెంచే సమయానికి వారిని తొలగించి, వారి స్థానంలో మళ్లీ ఫ్రెషర్స్‌ను తక్కువ వేతనాలతో నియమించుకుని పబ్బం గడుపుకుంటున్నారు.

ఇకనైనా ప్రభుత్వాలు, కార్మిక శాఖ అధికారులు సాఫ్ట్‌వేర్ కంపెనీల దురాగతాలపై దృష్టి సారించకపోతే యువత తప్పుడు మార్గాల్లో పయనించి వ్యవస్థకు ముప్పు తీసుకువచ్చే ప్రమాదం లేకపోలేదు.

**- డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**

కవర్ స్టోరీ

# 'స్థానిక' పాలనే గ్రామ స్వరాజ్యం

బండారు రామ్మోహన రావు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి రాష్ట్రంలో 2014, 2018లో రెండు సార్లు ప్రజామోదం పొంది సుమారు పదేళ్ల పరిపాలించిన టిఆర్ఎస్ (బిఆర్ఎస్) పార్టీ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకత మూట కట్టుకొని అధికారం నుండి దిగిపోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని ఓడించి ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారు.

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఇరవై నెలలు పూర్తయినా కూడా ఆ పార్టీ ప్రభుత్వం ఇప్పటి వరకు రాష్ట్రంలో పదవీ కాలం పూర్తయినా స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు నిర్వహించలేకపోయింది. ఒక పార్టీ పోయి మరో పార్టీ అధికారంలోకి వచ్చినంత మాత్రాన 'ప్రజాపాలన' కాదని స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసి అధికార వికేంద్రీకరణ చేసినప్పుడు మాత్రమే నిజమైన ప్రజాపాలనని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రభుత్వం గ్రహించాలి. ఇక కేంద్రంలో స్థానిక ప్రభుత్వాల పట్ల వివక్ష ఎలా కొనసాగుతుంది, ఏం జరుగుతుందో ఒకసారి పరిశీలిస్తే జెమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించారు. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే నినాదంతో మొదలైన ఈ జమిలి ఎన్నికల ఆలోచన ఆచరణ సాధ్యమా? కాదా? అనే వివాదం కొనసాగుతూనే ఉంది. అలాగే "ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని స్థానిక ప్రభుత్వాలు ఎన్నికలలో జాతీయ ఎజెండాను రుద్దడానికే" అనే విమర్శ కూడా ఉంది. జమిలి ఎన్నికలు దేశ వ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదంగా మారుతుందనే మరో విమర్శ ఉంది. అలాగే జెమిలి ఎన్నికల ప్రతిపాదనకు సానుకూల అంశాలుగా చెప్పబడుతున్న ఎన్నికల ఖర్చు ఒక సమస్య కాదని విమర్శించబడుతుంది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జెమిలి ఎన్నికల ముసాయిదాలో మొదట చెప్పినట్లుగా స్థానిక ప్రభుత్వాల ఊసు లేకపోవడం చూస్తే స్థానిక ప్రభుత్వాల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనబడుతుంది. పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల తర్వాత 100 రోజుల్లో స్థానిక ప్రభుత్వాలు ఎన్నికలు కూడా 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే జెమిలి ఎన్నికల ప్రాసెస్‌లో జరుగుతుందని గతంలో ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లులో ఆ ప్రసక్తి తీసుకురాకపోవడం ఉద్దేశపూర్వకంగానేనా అని అనిపిస్తుంది.

దేశవ్యాప్తంగా స్థానిక ప్రభుత్వాలు ఎన్నికలు ప్రతిసారి వాయిదా పడుతున్నాయి. 73, 74 వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించిన అధికారాలు కానీ ఆ సవరణలలో పేర్కొన్న ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు అనే అంశంపై కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ఇప్పటికే తేలిపోయింది. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రంలో 2024 జనవరిలోనే పంచాయతీ సర్పంచుల పదవీ కాలం పూర్తి అయిపోయింది. అదేవిధంగా 2024 జూన్‌లోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ మెంబర్ల పదవీ కాలంతో పాటు మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షుల పదవీ కాలం కూడా ముగిసింది. ఇక 2025 జనవరిలో రాష్ట్రంలో జిహెచ్ఎంసి మినహాయించి మిగతా అన్ని మున్సిపాలిటీల కౌన్సిలర్లు చైర్మెన్ల పదవీ కాలం పూర్తవుతుంది. ఈ దశలో దేశం సంగతి అలా ఉంచి తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ప్రభుత్వాలకు జమిలి ఎన్నికలు ఎందుకు జరగకూడదు? అనే ఒక సూచన వస్తుంది. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయాలు తీసుకొని వచ్చే ఫిబ్రవరిలో పంచాయితీ ఎన్నికలతో పాటే మండల జిల్లా పరిషత్ స్థాయిలో ఎన్నికలను ఒకేసారి పూర్తి చేస్తే దేశవ్యాప్త జమిలి ఎన్నికల సంగతి అటుంచి రాష్ట్రంలో జమిలి ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వమే శ్రీకారం చుట్టినట్లు అవుతుంది. అలా చేస్తే స్థానిక ప్రభుత్వాలను గౌరవించిన పార్టీగా గ్రామ స్వరాజ్యాన్ని ప్రతిపాదించిన మహాత్మా గాంధీ ఆశయాలకు కట్టుబడిన పార్టీ 73,74 వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీలకు మున్సిపాలిటీలకు రాజ్యాంగపరమైన హోదా కట్టబెట్టిన మాజీ ప్రధాని కాంగ్రెస్ నాయకుడు దివంగత రాజీవ్ గాంధీ కలల సాకారానికి పూనుకున్న పార్టీగా కాంగ్రెస్ పార్టీకి కూడా మంచి పేరు వస్తుంది.

ఈ దిశగా ఇప్పటికే పర్సన్ ఇన్చార్జిల పేరిట అధికారుల పాలనలో మగ్గిపోతున్న స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికలు జరపాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం డిలిమిటేషన్‌తో పాటు రిజర్వేషన్ల ఖరారుకు నెల రోజుల టైం అడిగితే ఈ జూలై 25 వరకు హైకోర్టు ఇచ్చిన సమయం కూడా పూర్తయిపోయింది. ఇంకా డిలిమిటేషన్ కానీ రిజర్వేషన్లు ఖరారు కూడా పూర్తి కాలేదు. కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న బీసీ రిజర్వేషన్ల 42 శాతం పెంపు అనే బిల్లుపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాలం గడుపుతుంది. రాష్ట్ర గవర్నర్ ద్వారా 2018 పంచాయతీ రాజ్ చట్టంలో సవరణ చేస్తూ పంపిన ముసాయిదా ఆర్డినెన్స్ కూడా ఇప్పటివరకు గవర్నర్ ఆమోదానికి నోచుకోలేదు.

రాష్ట్ర గవర్నర్ అనేకమంది న్యాయ కోవిధులతో మాట్లాడుతూ ఈ ఆర్డినెన్స్ చెల్లుబాటు గురించి న్యాయ సలహాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినట్లే ఇక పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఎలాంటి అడ్డంకి ఉండకపోవచ్చు. కానీ కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే మిగతా పార్టీలు ఇవ్వాల్సిన అవసరం లేదు. అప్పుడు కూడా కేవలం 2019 ఎన్నికల్లో పంచాయతీరాజ్ ఎన్నికలు జరిపినట్లే 22 చట్టబద్ధ రిజర్వేషన్లతోనే సరిపుచ్చుకొని ఎన్నికలు జరపాల్సి ఉంటుంది.



ఇక స్థానిక ప్రభుత్వాలలో దిశలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం దేశంలో స్థానిక ప్రభుత్వాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రిజర్వేషన్ పెంపు చేసి సుప్రీంకోర్టు విధించిన రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి దాటుతూ మళ్లీ సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని కొట్టివేయకుండా ఉండడానికి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలనే ప్రతిపాదనకు బిజెపి పార్టీ ససేమీరా అంటుంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి పంపిన బిల్లు పాస్ కావడం అసాధ్యం. ఇలాంటి పరిస్థితులలో తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.



## స్థానిక ప్రభుత్వాలు-ఒక పరిశీలన
## స్థానిక సంస్థలు కావు-స్థానిక ప్రభుత్వాలుగా పిలవాలి

1) భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో ఆర్టికల్ 40లో 'లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్' అని చేర్చారు. దీన్ని తెలుగులో అనువదిస్తే 'స్థానిక స్వపరిపాలన చేసే ప్రభుత్వం' అనే అర్థం వస్తుంది. అందుకే గ్రామ, మధ్యంతర, (మండల) జిల్లా స్థాయి పంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా పిలవాలి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కూడా ఇలాగే స్థానిక ప్రభుత్వాలుగా పిలవాలి.

2) 73, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం పంచాయతీలు, మున్సిపాలిటీల గ్రామ, పట్టణ, నగర ప్రభుత్వాలుగా పిలవాలి. 1994లో ఆమోదించిన పై సవరణల ప్రకారం రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధత ఏర్పడింది.

3) పార్లమెంట్- అసెంబ్లీల లాగానే స్థానిక ప్రభుత్వాలకు కూడా 73,74వ రాజ్యాంగ సవరణల ప్రకారం చట్టబద్ధత వచ్చింది.

4) 73వ రాజ్యాంగ సవరణలో ముఖ్యాంశాలు

ఎ) ఐదేళ్లకు ఒకసారి తప్పక ఎన్నికలు నిర్వహించాలి.

బి) స్థానిక ప్రభుత్వాల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటు.

సి) ఆర్థిక వనరుల కేటాయింపు కోసం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు.

డి) దేశమంతటికీ మూడంచెల విధానం. 1) గ్రామ పంచాయతీ 2) మధ్యంతర అంచె 3) జిల్లా పరిషత్

ఇ) మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అన్ని అంచెలలో అమలు కావాలి.

ఎఫ్) గ్రామ పార్లమెంటుగా గ్రామ సభ సంవత్సరానికి రెండు సార్లు నిర్వహించాలి. 1) ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి 2) అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు తప్పక గ్రామ సభలు నిర్వహించాలి. గ్రామ సభల తేదీలు జి.వో.ల ద్వారానే పేర్కొన్నారు.

5) 74వ రాజ్యాంగ సవరణ: పట్టణ, నగర ప్రభుత్వాల గురించి వివరిస్తుంది.

ఎ) 73వ రాజ్యాంగ సవరణలోని అన్ని విషయాలు వీటికి వర్తిస్తాయి. బి) 3 లక్షల జనాభా దాటిన మున్సిపాలిటీలకు వార్డు కమిటీలు ఏర్పాటు.

6) మూడు 'ఎఫ్'ల సిద్ధాంతం

ఎఫ్) ఫండ్స్ ఎఫ్) ఫంక్షన్స్ ఎఫ్) ఫంక్షనరీస్

నిధులు విధులు సిబ్బంది/నిర్వహణ చేసేవారు

పై సిద్ధాంతం ప్రకారం పాలన సాగాలంటే విధులు, నిధులు, వాటిని నిర్వహించే సిబ్బంది, కార్యనిర్వాహక వర్గం వుండాలి.

7) 50:50 సిద్ధాంతం

జాతీయ ప్రభుత్వం నుండి దేశంలోని ఇరవై ఎనిమిది రాష్ట్రాలకు, తొమ్మిది కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధుల వాటా పంచుతున్నారు. దేశంలో జాతీయ ప్రభుత్వం వసూలు చేసే పన్నుల డబ్బులలో 2015లో నీతి ఆయోగ్ వచ్చిన తర్వాత (దేశ ప్రణాళిక సంఘం బదులు) అన్ని రాష్ట్రాలకు పార్టీలు, ప్రభుత్వాలు అనే పక్షపాతం లేకుండా చట్టబద్ధంగా అంతకుముందున్న 32 శాతానికి బదులు 42 శాతానికి నిధుల పంపిణీని పెంచారు. అంటే మొత్తం జాతీయ ప్రభుత్వ ఆదాయంలో రాష్ట్ర వాటా 42 శాతం నిర్ణయించారు. ఇవికాక కేంద్ర, ప్రాయోజిత పథకాలు అయిన జాతీయ ఆరోగ్య మిషన్, సర్వశిక్ష అభియాన్, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లాంటి మరో పది, పదిహేను ముఖ్య పథకాల ద్వారా మరో ఎనిమిది శాతం నిధులు దాదాపుగా రాష్ట్రాలకు అందుతున్నాయి.




రాష్ట్రంలోని స్థానిక ప్రభుత్వాలకు జాతీయ ఫైనాన్స్ కమిషన్ కేటాయించే డబ్బు అదనం. ప్రస్తుతం 14వ ఆర్టికల్ సంఘ సిఫార్సుల ప్రకారం గ్రామ పంచాయతులకే నేరుగా జనాభా ప్రకారం నిధులు కేటాయిస్తున్నారు. 13వ ఆర్టికల్ సంఘం గ్రామ పంచాయతీలతో పాటు మండల (మధ్యంతర) జిల్లా పరిషత్లకు నిధులు కేటాయించగా 14 ఆర్థిక సంఘం మాత్రం కేవలం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకే నిధులు కేటాయిస్తుంది.

15వ ఆర్థిక సంఘం దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకుంటుంది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు 2019-20 ఆర్థిక సంవత్సరంతో ముగుస్తాయి.

## 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు

2020-21 నుండి అమలులోకి వచ్చి ఐదేళ్లు. 2024 వరకు అమలులో వుంటాయి. 13వ ఆర్థిక సంఘంలాగే గ్రామ పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్లకు కూడా ఈసారి వాటా ఇవ్వాలనే ప్రతిపాదన వుంది.

## 73వ రాజ్యాంగ సవరణలు కేటాయించాల్సిన అంశాలు

73వ రాజ్యాంగ సవరణకు ముందు రాజ్యాంగంలో జాతీయ ప్రభుత్వం చేసే పనులు, యూనియన్ లిస్ట్ రాష్ట్ర ప్రభుత్వాలు చేసే పనులు స్టేట్ లిస్ట్ ఇద్దరికీ కలిపి కేటాయించిన అంశాలు కంకరెంట్ లిస్ట్గా విభజించారు. స్థానిక ప్రభుత్వాలకు విడిగా కేటాయించిన విధులు మొదట భారత రాజ్యాంగంలో లేవు. జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీదే స్థానిక ప్రభుత్వాలు ఆధారపడి వుండేవి. 73వ రాజ్యాంగ సవరణ తర్వాత 29 విధులను పంచాయతీ వ్యవస్థకు 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం 18 విధులను మున్సిపాలిటీ నగరాలకు కేటాయించారు. జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధులను స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలి. దేశంలోని కేరళ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కొంతవరకు ఎక్కువగా అమలు చేశాయి. ఈ విషయంలో మన తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా కేవలం పదకొండు, పన్నెండు అంశాలు మాత్రమే స్థానిక ప్రభుత్వాలకు బదలాయించి దేశంలో అధ్వాన్నంగా వున్నాయి. స్థానిక ప్రభుత్వాలు స్ఫూర్తిని నీరుగార్చాయి.

## తలసరి గ్రాంటు కథ కమామిషు బిచ్చమేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు (ఏపి, తెలంగాణ) స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చే తలసరి గ్రాంటు(పర్ క్యాపిటా గ్రాంట్) చూస్తే మతిపోతుంది.

**జనాభా ప్రకారం:** ఎ) గ్రామ పంచాయతీలకు తలకు ఒక్కంటికి సంవత్సరానికి 4/- రూపాయలు.

బి) మండలాలకు తలకు ఒక్కంటికి సంవత్సరానికి 8/- రూపాయలు.

సి) జిల్లా పరిషత్లకు తలకు ఒక్కంటికి సంవత్సరానికి 4/- రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. ఒక గ్రామ జనాభా వెయ్యి అనుకుంటే సంవత్సరానికి ఆ గ్రామానికి 1000x4000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం బిచ్చమేస్తుంది. మిగతా రాష్ట్ర ప్రభుత్వాలను చూస్తుంటే ఆయా రాష్ట్రాల బడ్జెట్లో తలసరి ఇరవై రూపాయల నుండి యాభై రూపాయలదాకా పంచాయతీలకు ఇస్తున్నారు. కేరళ లాంటి పంచాయతీలకు 50 శాతం నిధులు కేటాయిస్తుంది.

## ఎమ్మెల్యే/ఎంపిల రాజ్యం పోవాలి




ప్రస్తుతం గ్రామ, మండల, జిల్లా పరిపాలన ఎమ్మెల్యేలు, ఎంపిల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఎమ్మెల్యేలకు నియోజక వర్గ అభివృద్ధి నిధులు ఒక కోటి, కేంద్ర ప్రభుత్వం తమ ఎంపిలకు నియోజక వర్గ అభివృద్ధి నిధులు ఎంపిఎల్ఎడిఎస్ 5 కోట్ల రూపాయలు సంవత్సరానికి ఇస్తున్నారు. ఆ నిధులు ఆయా జిల్లాల కలెక్టర్లు కార్య నిర్వహణాధికారులుగా పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఖర్చు చేయడానికి స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఎంపి/ఎమ్మెల్యేల చుట్టూరా ప్రదక్షిణలు చేయాల్సి ఉంటుంది. వారు కరుణిస్తే అభివృద్ధి; వారు 'శీతకన్ను' వేస్తే దరిద్రం.. పరిస్థితి ఇలా వుంది.

స్థానిక ప్రభుత్వాల పరిస్థితి 73, 74వ రాజ్యాంగ సవరణలకు ముందే బాగుండేది. కాగితాల మీద అధికారం అయితే వచ్చింది. వాస్తవానికి క్షేత్ర స్థాయిలో అనుభవం మరోలా వుంది. ఏ రాజ్యాంగ సవరణ లేకముందే ఆనాటి పంచాయతీలు, సమితులు, జిల్లా పరిషత్‌లు నిధులు, విధులు పుష్కలంగా వుండి అభివృద్ధికి బాటలు వేసేవారు. ఆనాటి పంచాయతీ సమితి ఎమ్మెల్యే కంటే శక్తివంతమైంది. జిల్లా పరిషత్ చైర్మన్ క్యాబినెట్ హోదా మంత్రి కంటే శక్తివంతుడిగా వుండేవాడు. జిల్లాకు రాజుగా, జడ్‌పి చైర్మన్ వుంటే, పంచాయతీ సమితి అధ్యక్షులు నలభై ఏడు ప్రభుత్వ శాఖలకు అధిపతిగా వుండి విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్ప, వ్యవసాయం, పశుపోషణ.. ఇలా చాలా శాఖలు సమితి, జిల్లా పరిషత్ ఆధీనంలో వుండేవి.

ఎమ్మెల్యే/ఎంపిలు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చట్ట సభలలో మంచి ప్రయోజనకరమైన చట్టాలు చేసే విధంగా పని చేయాలిగానీ స్థానిక ప్రభుత్వాల పనిలో జోక్యం చేసుకోవడం తగదు. ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి. కుక్క పని కుక్క, గాడిద పని గాడిద చేయాలనే సామెత వుండనే వుంది కదా!

## స్థానిక ప్రభుత్వాలు-చారిత్రక పరిణామం

ఆదిమ సమాజంలో ఆహార సేకరణ దశ నుండి ఆహారాన్ని పండించడం, ఉత్పత్తి దశకు చేరుకున్న మానవులు, అదనపు ఉత్పత్తులు దాచుకోవడానికి ఆవాసాలు ఏర్పరచుకున్నారు. చెట్లూ, పుట్టలు పట్టుకుని తిరిగే మానవులు, శాశ్వత ఆవాసాలకు వ్యవసాయ వృత్తి, ఆహార ఉత్పత్తి కారణమైంది. ఎప్పుడైతే స్వంత ఆస్తి, ఇల్లు, ముంగిలి ఏర్పడ్డాయో వాటిని గుర్తించడానికి రాజ్యం, స్టేట్ అనే వ్యవస్థ కావాల్సి వచ్చింది. ఇదే రాజ్యావతరణ సిద్ధాంతం. ఆ రాజ్యావతరణంలో ఏర్పడిన మొదటి ప్రభుత్వాలు, గుంపు ప్రభుత్వాలు.. అవి పెద్దవైతే గూడేలు, గ్రామాలు, పట్టణాలు, నగరాలు.. ఇలా జన సమూహం నివసించి ఒక ప్రత్యేక ప్రాంతానికి ఆయా దేశ కాల, వాతావరణ, స్థానిక పరిస్థితులను బట్టి పాలనా వ్యవస్థలు ఏర్పడ్డాయి. అలా మొదలైనవే గణ రాజ్యాలు. గణాల మధ్య, రాజ్యాల మధ్య, రాజ్య విస్తరణ కాంక్షలో కలిసిపోవడం, విడిపోవడం, మళ్లీ యుద్ధాలు, మళ్ళా కలవడం.. ఇలా పరిణామ క్రమంలో ఇప్పుడున్న దేశాలు, ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దేశాల మధ్య సమన్వయానికి యుద్ధాలకు విరామం ప్రకటించడానికి ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసుకున్నాం.

## కంటి ముందు పాలన-ఇంటి ముందు ప్రభుత్వం

గ్రీకు నాగరికత నగర రాజ్యాలదయితే మన భారతదేశంలో సంస్థానాలు, రాజులు, రాజ్యాలూ, చక్రవర్తులూ, సామంతులూ, సామంత రాజ్యాలుగా పరిణామ క్రమం పొందింది. ఏదేమైనా ప్రజలు నివసించే చోట పాలన వుండేది. అది కాస్తా ఆధిపత్య, సామ్రాజ్యవాద ధోరణితో ఒకరి మీద మరొకరు పెత్తనం చేసే క్రమంలో సంస్థానాల నుండి రాజ్యాలు, దేశాలుగా ఏర్పడి పాలన కొంత కష్టమైంది. మొదట కంటి ముందు పాలన-ఇంటి ముందు ప్రభుత్వం వుండేది. కాలక్రమంలో ఇలా గల్లీలో సమస్యలకు ఢిల్లీలో పరిష్కారం వెదికే పరిస్థితి వచ్చింది. కానీ చాలా అభివృద్ధి చెందిన దేశాధినేతలు దేశాలు వున్నా స్థానిక ప్రభుత్వాలకు 'కౌంటీ'లని ఇతరత్రా ఏ పేరుతో పిలిచినా కూడా వాటికి స్వతంత్రత, ఆర్థిక, పాలనా విషయాల్లో వెసులుబాటు కల్పించాయి. అవి చేయి చాచే పరిస్థితి లేకుండా అధికారాలు, నిధులూ పైకి బదలాయించి పై ప్రభుత్వాలే స్థానిక ప్రభుత్వాల నుండి వాటా తీసుకునే పరిస్థితి వుంది.

## థియరీ ఆఫ్ సబ్సిడియారిటీ-పౌరుడు కేంద్రంగా పాలన

"పుర్రెకో బుద్ధి.. జిహ్వాకో రుచి" అన్నారు పెద్దలు. అంటే ఎవరి ఆలోచనలు వారివే. ఎవరి జిహ్వా చాపల్యాన్ని బట్టి వారు తినే పదార్థాలను ఎంచుకోవచ్చు. అది వారి వ్యక్తిగత ఇష్టం. అదే కుటుంబంలో తమ అమ్మాయి పెళ్లి చేయాలనుకుంటే తల్లిదండ్రుల ఇష్టం మాత్రం చెల్లదు. మొదట పెళ్లి చేసుకోబోయే అమ్మాయిని అడగాలి. ఆ తర్వాత అబ్బాయి తరపువారిని అడగాలి. ఇలా అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు చూడాలంటారు. అమ్మాయి పెళ్లి దగ్గరికి వస్తే వ్యక్తి స్వేచ్ఛ హరించింది కుటుంబానికి అధికారం వచ్చింది. మనం ఒక్కరి కోసం మన ఇంటి ముందు రోడ్డు వేసుకోలేం.

అలాగే మన పిల్లల కోసం మనం ఒక స్కూలు పెట్టుకోలేం. అలాగే మా కుటుంబం కోసం మాత్రమే ఒక ఆసుపత్రి కట్టుకోలేం. ఇలాంటి వాటిని సమిష్టి అవసరాలు అంటారు. ఇలాంటి సమిష్టి అవసరాల కోసమే స్థానిక ప్రభుత్వాలు కావాలి.